# సూరి సిద్ధాంతం

అప్పుడేవచ్చిన ఆంధ్రపత్రిక పేజీలు తిరగేస్తూ 'ఈ హరిజనసమస్య మొత్తంమీద జనాన్ని అల్లకల్లోలం చేస్తున్నదిరా. సూరీ' అన్నాను.

సూరి బద్ధకంగా నవ్వి 'జనానికి అల్లకల్లోలం కావటం చాలా ఇష్టమని నీకు తెలుసునా?' అన్నాడు.

నాకు కోపంవచ్చింది.

'నీకు దేన్నిచూసినా గౌరవంలేదురా, సూరీ' అన్నాను.

'ఒకరికున్నట్టు!'

'మతగురువులంతా చూడు ఎంత ఘోష పెడుతున్నారో!'

'పులివిస్తరాకుదగ్గిర కౌకులూ, ఎముక దగ్గిర కుక్కలూ, బహిర్దేశంలో పందులూ గోలచేసినట్టు!'

'మతాన్ని వాటితో పోలుస్తావా?'

సూరి బిగ్గిరిగా నవ్వటం మొదలుపెట్టాడు.

'ఇందులో హాస్యం నాకర్థంకాలేదు!' అన్నాను తీక్ష్ణంగా.

సూరి వినిపించుకోకుండా 'పోలిక మతానికి వాటికీ కాదు; మతగురువులకూ వాటికీ!' అని మళ్ళీ నవ్వటం మొదలుపెట్టాడు.

తెలుగులో తిట్టటానికి ఉండదగినన్ని మాటలు లేవు. ఆ ఉన్నవాటినే రెండుమూడు వరసలు ప్రయోగించిన మీదట సూరి దారికి వచ్చాడు.

'ఒరే! నీకున్న మెదడే బహుకొద్ది. అకాస్తాకూడా పాయిజనయిపోయింది నువ్వు మెంటల్‌గా చచ్చినవాడికింద లెక్క.''

'ఎందువల్ల? నీమాదిరిగా పవిత్రమైన విషయాలను హేళనచెయ్యను గనకనా?'

'పవిత్రమేమిట్రా, నీమొహం! నీ దేమతం?'

'అట్లా అడగటంలో నీ అభిప్రాయం ఏమిటి?'

సూరి నావైపు వేలుపెట్టి చూపిస్తూ, 'చూశావా! అంత చిన్నప్రశ్నకు కంగారుపడకుండా సమాధానం చెప్పలేవు. నువ్వు మెంటల్‌గా చచ్చావంటే ఎందుకు ఎగిరి పడతావు'

'నాది హిందూమతం.' అన్నాను గర్వంగా.

'అంటే నీకు ఆమతాన్ని చూస్తే గౌరవమనా? లేక నీకు దాన్నిగురించి ఏమైనా తెలుసునా?'

'కావలిస్తే నాకు హిందూమతాన్నిగురించి ఏమీ తెలీదని ఒప్పుకుంటాను. కాని నాపూర్వులది హిందూమతం... నాతండ్రులదీ, తాతలదీ, నాదీ ఆమతమే!'

మళ్ళీ సూరి నవ్వటం మొదలుపెట్టాడు.

'ఎందుకావెఖవనవ్వు?'

'ఏమిట్రోవ్! మతంకూడా (నవ్వు) ఆస్తల్లే—గుణాలల్లే—రోగాలల్లే (నవ్వు) హెరిడిటరీగా—సారీ!—వంశపారంపర్యంగా (నవ్వు) వస్తుందా ఏమిట్రోవ్! హా! హా! హా! హా!'

'ఏమిటా తెలివితక్కువ ప్రశ్న? ఎందుకు రాకూడదు?'

సూరి తన నవ్వును ఒక్కదెబ్బతో స్విచాఫ్ చేసుకుని పెద్దగుడ్లుచేసి నావంక చిత్రంగా చూడటం మొదలుపెట్టాడు.

'ఏమట్లా చూచెదవు?'

'మరేంలేదు. మనిషి జ్ఞానానికంతుందికాని అజ్ఞానానికి లేదు!'

సూరి ఆమాట అన్నతరవాత నాకు చాలాసిగ్గేసింది. వాడి పద్ధతులూ అభిప్రాయాలూ నాకు విపరీతంగా కనపడవచ్చుగాక; వాడి తెలివెక్కడ నా తెలివెక్కడ! నేను వాడితో ఇంతసేపు నాకేమీ తెలీని విషయాన్ని గురించి వాదించటమేమిటి? వర్ణాశ్రమ ధర్మాలనీ, ఆచారాలనీ, నీతనీ, మతమనీ అందరూ అంటుంటే విని సంభాషణలో వాటిని గురికి ఒకమైలు అటూ ఇటుగా ప్రయోగించటమేకాని వాటినిగురించి నాకేంతెలుసు?

నేను తెల్లజండా ఎత్తి సంధికి జొరబడ్డాను.

'ఇదంతా ఎందుకన్నాని నూరీ! మతం, ఆచారాలు మొదలైనవాటిని గురించి నీకు తెలిసింది చెప్పు వింటాను,' అన్నాను.

'విను, చెబుతాను, నీకూ జంతువుకూ భేదం ఏమిటి?'

'అ దెందు కిప్పుడు?'

'ఒరే! ప్రశ్నకు సమాధానం చెప్పటానికి అంత గందరగోళ మెందుకురా! ఆవెధవగుణం మానెయ్యి. చెప్పు?'

'ఏముందీ! మనం నిలువుగా నడవగలం. ఇంకా—ఇంకా—వెధవది ఒక్కటీ జ్ఞాపకంరాదేం!'

నూరి నాకడ్డంవచ్చాడు.

'నిలువుగానడిచి నువ్వొందంగా ఉన్నదేంలేదు ఆ భేదాలన్నీ నేనే చెబుతాను. నువ్వు మాట్లాడగలవు. అందువల్ల అబద్ధం ఆడటం ఒకటి నేర్చుకున్నావు. రాయటం చాతవును. దొంగదస్కతులు పెట్టటం కూడా చాతవును—ఎవరో అన్నట్టు. సంగీతం పాడగలవు, ఎక్కిరించగలవు. అవన్నీ అట్లాఉంచి నీకూ జంతువుకూ కల ముఖ్యమైన భేదంచెప్పు'

'నాకు తెలీదు.'

'నీకు బుద్ధిఉంది! జంతువుకులేదు!'

'కావచ్చును. కాదనను.'

'అది అట్లాఉంచు. నీదగ్గిరఉన్న వస్తువులన్నీ నువ్వు ఉపయోగిస్తున్నావని ఉందా?'

'లేదు. నాదగ్గిర రేజరుంది ఒకసారి దాంతో చేసుకునేటప్పటికి మొహంనిండా గాట్లు—'

'సరే! సరే! అదంతా తరవాత. నీబుద్ధిని నువ్వెప్పుడయినా ఉపయోగించిన జ్ఞాపకం ఉందా?'

'అయ్యో! ఎందు కుపయోగించను? ప్రతిక్షణం—'

'ఓరి మూఢుడా? నీకు బుద్ధంటే అర్థంకాలేదు. మనస్సనుకుంటున్నావు. మనసువేరు బుద్ధివేరు. వాళ్లూ వాళ్లూ అనేకవిషయాలను గురించి అనుకుంటున్న మాటలన్నీ జ్ఞాపకం ఉంచుకుని వాటిని నిజంకింద అంగీకరించి వాటిప్రకారం ఆచరించటం బుద్ధిని ఉపయోగించటంకాదు.. దేన్నిగురించయినా నీ అభిప్రాయం ఒకటి ఏర్పరుచుకున్నావా? నిజంచెప్పటం మంచిదని విన్నావు. బాగానేఉంది. నిజంచెప్పటం తప్పుకావచ్చు నిజంగా! నువ్వెప్పుడన్నా ఆవిషయం నీబుద్ధికి పని ఇస్తేగా!'

'ఆఁ! ఆఁ! నీ అభిప్రాయం నాకిప్పుడు చక్కగా తెలుస్తున్నది. ఇక పైకివెళ్ళు.'

'ఐసీ! ఇంగ్లీషును తర్జుమాచెయ్యటానికి నీకూ అభ్యంతరం లేదన్నమాట.'

'ఇంతసేపటినించీ మాట్లాడుతున్నాం. మతాన్ని గురించి నువు ఒక్కముక్క చెప్పలేదు.'

'దానికే వస్తున్నాను. నీకు తెలిసినంతలో ఏజంతువుకైనా మోక్షంఉందా?'

'నాకేమతాన్నిగురించీ తెలిసి అఘోరిస్తేగా! జంతువులకు మోక్షంలేదేమో అనుకుంటాను.'

'జంతువులకు మతంకావాలా?'

'బహుశా అవసరంలేదు'

'నీవంటి జంతువులు లోకంలో ఎంతమంది ఉన్నారంటావు?'

'లక్షలు! కోట్లు! సామాన్యంగా నేను తెలివిగలవాడికింద లెక్క! తెలుసా నీకాసంగతి?'

నూరి నవ్వాడు

'తెలుసునా. వీళ్ళందరికీ మతంతో ఏమీ అవసరం లేదని తెలుసుకో. వాళ్ళంతా ఆహారం, నిద్రా, మైథునం స్టేజి దాటలేదు. అమూడూ వాళ్ళకిప్పిస్తే మతం ఏమైనా వాళ్ళకు తొందరలేదు. సంఘం ఏంచేస్తున్నది? వాళ్ళ కామూడూ అందకుండా చేస్తున్నది. మతగురువు లేంచేస్తున్నారు? వాళ్ళకు మతం ఇస్తున్నారు. వాళ్ళకు మతం సరయిన ఆహారం కాకపోవటంవల్ల అనేకజాడ్యాలు బయలుదేరుతున్నై. నీ సూపర్స్టిషన్ అనేది ఈతరగతి జాడ్యమే. బలులు, యజ్ఞాలు, సంతర్పణలు, లక్షవత్తుల దీపాలు, లక్షపత్రిపూజ—పిండికి రోజుకు అణాడబ్బులు దొరక్క ఒకచెంప కొంతమంది మాడుతుంటే!

'నీమతం ఎంతదరిద్రపుమతమంటే, ఒకచెంప వంశపారంపర్యంగా వస్తూనూ ఉంటుంది, నువ్వు పిలకకత్తిరించి క్రాపింగుపెట్టినప్పుడూ, బూటూ సూటూ వేసినప్పుడూ, వితంతువును వివాహంచేసినప్పుడూ, నీ స్నేహితులతో భోజనంచేసినప్పుడూ, చివరకు స్టీమరెక్కినప్పుడూ పోయి మళ్ళీ ఎట్లాగో నీదగ్గిరికి తిరిగి వస్తూ ఉంటుంది. ఇవాళ శూద్రవాళ్ళతో అన్నంతింటే మతంపోయింది కదా, రేపు విధవావివాహం చేసుకుంటే ఏమనటానికి వీల్లేదు. ఈలోపల అప్పుడే మతం మళ్ళీ వచ్చిఉంటుంది

'ఇంకోచిత్రం చూడు. నేను మతానికి ప్రచారం లేదంటాను'

'అది నేను ఒప్పుకోను. బుద్ధుడు, శంకరుడు, క్రీస్తు, వివేకానంద, మహాత్మాగాంధి, అంతా ప్రచారం చేసినవాళ్ళే.'

'అందుచేత నేను నాబుద్ధికితోచినమాట అనకూడదంటావా ?'

'నూకీ నువ్వు తెలివికలవాడివి కావచ్చుగాక శంకరాచార్యులూ, క్రీస్తూ, మహమ్మద్—వీళ్ళకంటెనా?'

'ఎందుక్కాకూడదురా ? స్వరాజ్యం, స్వేచ్ఛ అని గొంతు పోంగుకుపొయ్యేదాకా అరుస్తారే నాబుద్ధిని వాళ్ళబుద్ధులకు దాస్యం చెయ్యమన్నావా? మతం హిస్టరీ అనుకున్నావా, జాగ్రఫీ అనుకున్నావా బోధచెయ్యటానికి? బుద్ధుడిమతం తీసుకున్నవాళ్ళలో మరొక్క బుద్ధుడున్నాడా? నిజమైనక్రైస్తవుడు క్రీస్తొకడేనా? ఇంకొకడున్నాడా? అర్జునుడి తరవాత జీవితంలో భగవద్గీత అర్థంచేసుకున్నవాడి లక్షణాలేవైనా ఉన్నవా? పైగా ఈమతాలు ప్రచారం కావటానికి ఎంత నెత్తురు ప్రవహించిందో తెలుసునా? ఇదంతా ఎందుచేత ?'

'మిగిలినవాళ్ళు పశుప్రాయులు కావటంచేత నేనంటావు. కావచ్చును. కాదనను. సరేకాని ఈ విషయం నీకొక్కడికే తట్టటం ఎందుకు? ఇంకెవ్వరూ ఎందుకు గ్రహించలేదు ?'

'ఇంకెవ్వరికీ తట్టలేదని ఎట్లా చెప్పగలవు? లోకంలో ఉన్న పుస్తకాలన్నీ చదివావా ?'

'మనకు తెలిసినంతలోనే.'

'నిజానికి ఈవిధంగా చెప్పినవాళ్ళెవరూ లేరు. కాని ఎవరికి తట్టదనేది పొరపాటు. నేను నిరుద్యోగిగా ఉన్నాను కనక ఈవిషయం మాట్లాడుతున్నాను నీతో. లేకపోతే నాకేంపట్టింది నీతప్పులు దిద్దేటందుకు ?'

'ఎవడికైనా మతం కావలిస్తే ?'

'ఉన్నమతాలను గురించి చదువుతాడు. తనమతం సృష్టించుకుంటాడు. నాచొక్కాలు నీకెట్లా సరిపోతై? ఇంకోచిత్రం చూడు. చాలామంది అభిప్రాయం ఆచారాలే మతమని.'

'మతాన్ని తృణీకరించావు. ఆచారాలనుగురించి నీ అభిప్రాయం ఏమిటి? వాటినిచూస్తే నన్నా నీకు గౌరవం ఉందా ?'

'మీతాతగావంచానుచూస్తే నీకు గౌరవముందా?'

'ఆ'

'మీతాతగావంచా నువ్వుపయోగిస్తావా ?'

'నాకెట్లా పనికొస్తుంది ?'

'ని చిరిగి పాపుమాసిపోయిన ఆచారాలు నాకెట్లా పనికొస్తై? ఆచారమనేది కేవలం పనిముట్టు. మనిషి ఉపయోగంకోసం ఏర్పడ్డది ఆచారంకాని మనిషి ఆచారంకోసం ఏర్పడ్డవాడుకాడు. అని నువ్వెందుకు గ్రహించవు? నీకేబుద్ధి ఉంటే. చిన్నతనంలో భర్తపోయిన పిల్లకు తిరిగిపెళ్ళిచెయ్యి, నువ్వెంతవరకు పశువువో ఆపిల్లా అంతేను. ఆమెకూ సంసారసుఖం కావాలి అని నీకింకెవరో చెప్పవలిసిన అవసరం ఏముంది? నువ్వు నిర్బంధంచెయ్యకపోతే ఆపిల్ల ఇంకోభర్తను చూసుకోదా? నీకు బుద్ధిలేదు కనకా, నీ బుద్ధిలేకపోవటం ఇతరప్రాణులకు అపాయకరంగా ఉంది కనకా నీమీద ప్రచారంచెయ్యాలి. గాంధీమహాత్ముడుచేసే ప్రచారం అదే. నీకు నిజంగా లాభించే ఆచారాలు నువ్వుంచుకో రోజుకు పదిస్నానాలుచెయ్యి. మడిగట్టుకో. సంధ్యవార్చు. తద్దినాలుపెట్టు. ఎవ్వరికీ అపకారంలేదు.'

'మాలవాళ్ళను ముట్టుకోవటం విషయం?'

'మాలవాళ్ళను ముట్టుకోకు. బ్రాహ్మణ్ణికూడా ముట్టుకోకు. ముట్టుకోమని ఎవరన్నారు? వాళ్ళతో కలిసిభోజనంచెయ్యకు. ఎవరితోనూ కలిసి భోజనం చెయ్యకు, భోజనంచెయ్యటం చాలారహస్యమైపని. కాని వాళ్ళను వెలివెయ్యటం ఎందుకు? నీబావిలో వాళ్ళు నీళ్ళుతోడితే నీప్రాణం ఏంపోయింది? వాళ్ళు నీయిళ్ళ మధ్య ఎందుకు నడవరాదు? అంత వాడితో సంబంధం లేకుండా ఉన్నవాడివి నీతెగిన చెప్పులు వాడి మొహాన ఎందుకు పారెయ్యటం? నీ చచ్చినగొడ్లు వాడికెందుకు వప్పగించటం? వాడికూతురుకు నువ్వెందుకు కన్నుగొట్టటం? వాడే ఎవరిధర్మాన్నో చదువుకుని అధికారిగావస్తే వాడికి షేక్‌హాండు చెయ్యటం ఎందుకు? ఏం ఆచారంరా? నీమొహం ఆచారం! నీశరీరంలో ఏ మాలవాడినెత్తురూ లేదని ఏమిటి నిదర్శనం?'

'ఒరే అటువంటి మాటలంటే నే నూరుకోను.'

'మాటవరసకన్నానురా! నువ్వంటే నువ్వని కాదు. నీ ఆచారాలన్నీ తెగి దాళ్ళుపడి పోయినవని నమ్ముతావా?'

'నమ్ముతాను కాని, సూరీ, కొన్నికొన్ని ఆచారాలకు వ్యతిరేకంగా నడవటం అవినీతి కాదా?'

'హాఁ. నీతినిగురించి మాట్లాడుతున్నాడండీ గుంటడు. ఇదినీతి, ఇదినీతి కాదు అని రాసిపెట్టి ఉందా ఏమిటి?'

'ఎందుకులేదు.'

'నీతంటే ఏమిటని నీ అభిప్రాయం?'

'ఈమధ్య ఒకాయన రాసినవ్యాసం చదివాను

## ఓ ప్రభూ!

అట మహాదివ్యలోకహర్మ్యాంతరముల
సన్నని యెలుంగు దైన్యంబు జాలువార
ఎవ్వరో పిలుచురీతి విన్పించు నాకు
కలత నిద్దురలోన ఏకాంత మందు
కనుల నశ్రులు ధారలై గార నెవరో
మచ్ఛిరోభాగ మభిషేకమానితముగ
సేయుచుందును—
ఇది పురాభూతసంబంధ మేమొకాని
ఎచటివో దుఃఖవేదనాప్రచలితములు
భయదనిశ్వాసములు మనఃపథము జేరి
కలచుచున్నవి ఓప్రభూ! గాఢలీల
ఈవి ఘోరాగ్రతపవ్యధాపృథులమైన
భారవహమైన జీవనవ్యాజమునకు
ఏమి యర్పింతు? తరియింతు నెట్లు? సామి!

—ఊటుకూరు సత్యనారాయణరావు.

లేరా. ఆడవాళ్ళఎదుట బూతుమాట్లాడటం అవినీతి. అవునా?'

'అవును. ఆమాటలు ఉప్పరఆడవాళ్ళ దగ్గిరా, దొమ్మర ఆడవాళ్ళదగ్గిరా మాట్లాడటం అవినీతేనా?'

'కాకపోవచ్చును.'

'కాకపోవచ్చునేమిటి? కాదు. ఒకదేశంలో మగవాడు అయిదునిమిషాలకో భార్యను చేసుకున్నా నీతిబాహ్యంకాదు. ఏమంటావు?'

'అవునులే. మనదేశం ఇంకాఅంత—'

'ఏడిచావులే. పసికూనకు పెళ్ళిచేసి వెంటనే మొగుడు పోతే 'అమ్మాయి, నీకర్మం ఇట్లా కాలింది కనక నువ్వు సంసారసుఖం కోరావా నీతిమాలినదానివవుతావు కనక మాఅందరి తృప్తికోసం నువ్విట్లాగే పడుండు' అంటావా ఏమిటి? కొంత కొంతమంది సంఘసంస్కారులు చూస్తానుకదా, కాపరానికి పోకపూర్వం వైధవ్యం తటస్థించిన పిల్లల పునర్వివాహంవిషయమే లెక్కచేస్తారు, ఒక సంవత్సరం, పది సంవత్సరాలు, కాపరంచేసిన మనిషికి సంసారసుఖం అక్కర్లేనట్టు.'

'ఎందుచేత?'

'పది సంవత్సరాలు కాపరంచేసిన దానికి మళ్ళీ పెళ్ళిచెయ్యమంటే అంతా తిరగబడి మాడు పగలగొడతారేమోనని. ఎనభైఏళ్ళదికాని తిరిగి పెళ్ళిచేసుకుంటానంటే తప్పేమిటంట. ఇష్టమైనవాడే వస్తాడు.'

'ఒరే సూరీ. నువ్వు పడమటికన్నా పడమటవుతున్నావు. సంఘం ఏ స్థితికొస్తుందో ఆలోచించు.'

'వీరంతా కలిసి సంఘాన్ని ఉద్ధరిస్తున్నట్టు, నీకు

ఓపికఉంటే ఒక తమాషాసంగతి చెబుతాను విను. నేనెరిగిన ఒక కుర్రవాడుండేవాడు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే పోయినారు దరిద్రుడు. ఎక్కువ తెలివిగలవాడు కాడు. ఒకరిద్దరు పెద్దమనుష్యులు పూనుకుని వాడికి వారాలు ఏర్పాటుచేసి స్కాలర్షిప్పిప్పించి చదువు చెప్పించారు. వాడు ఫిఫ్తుఫారం చదువుతూ సరిగా పరీక్షలకుముందు చచ్చేటంత జబ్బుపడి ఎట్లాగో బతికాడు కాని పరీక్షపోయింది. హెడ్మాస్టరొకపిగ్ హెడెడ్ రాస్కెల్. స్కాలర్షిప్పివ్వనన్నాడు. వాడికి మొదట్లో సహాయంచేసిన ఒకరిద్దరూ చచ్చిపోయినారు. ఈ జబ్బులో వారాలు పోయినై. ఇక చదువుకునే ఆశ వదులుకుని వాడు మాతామహుడుగారింటికి పోయినాడు.

'వాడిపినతల్లి ఒకమ్మాయి ఉండేది. పెద్దమనిషయింది. కాపరానికి పోలేదు. వాడూ ఈడొచ్చిన పిల్లవాడు. అక్కడికిపోయినప్పటినించీ వాడు ఆ పిల్లతో ఫ్లిర్టింగ్ మొదలుపెట్టాడు తనకు తెలీకుండానే. ఆపిల్లా వాణ్ణి అడ్డగించలేదు. ఇద్దరూ ఒక్కచోట కూర్చుని ఆలోచనలు చేసేవాళ్ళు, ఇంకొకళ్ళుచూసినా తిట్టటానికి వీలులేనంత దగ్గిరిగా కూర్చునేవాళ్ళు, ఏదో నెపం మీద ఒకళ్ళనొకళ్ళు తాకేవాళ్ళు. ఒకళ్ళవెంట ఒకళ్ళు పరిగెత్తేవాళ్ళు. ఇట్లా కొంతకాలం గడిచిపోయింది. ఒకరోజున ఆకుర్రవాడు కొద్దిగా లిమిట్ దాటాడు. ఆపిల్ల ఎదురుతిరిగి తిట్టింది. అందరితో చెప్పింది. అందరూ వాణ్ణి తిట్టారు. వాడుకూడా వాణ్ణి తిట్టుకుని, పశ్చాత్తాపపడి—పశ్చాత్తాపమంటూ ఒకటి ఉన్నట్టు—అక్కణ్ణించి లేచి పట్టణంవచ్చాడు తిరిగి... వాడు చేసినపనినిగురించి నీవ్యాఖ్యానం ఏమిటి?'

'నావ్యాఖ్యానమేముంది? నేనైతే వాణ్ణి చొక్కా విప్పి చర్మం పొంగేటట్టు తాటిమట్టతీసుకొని కొడుదును.'

సూరి కొంచెంసేపు మౌనంగా కూర్చుని, కథ సాగించాడు.

'ఎవరూ వాడికి ఉద్యోగం ఇవ్వలేదు. ఎవరో ప్లీడరుగారు దయదలిచి వాడికి తనదగ్గిర వాలంటీరుపని ఇచ్చాడు. అక్కడ కొంతకాలం పనిచేసినతరవాత వాడికా మోసం, అబద్ధాలు, దుర్మార్గం చూస్తే అసహ్యం వేసింది. అక్కణ్ణించి చెప్పకుండా లేచిపోయినాడు... దానిమీద నీవ్యాఖ్యానం ఏమిటి?'

'ఫూల్. కావాల్నంటే ప్లీడరుగుమాస్తాగాఉండి న్యాయంగా ఉండకూడదా ఏమిటి?'

సూరి చిరునవ్వు నవ్వాడు.

'వాడికి చివరకొక్కటి తోచింది. మనం బ్రాహ్మణకులంలో పుట్టాం, విధ్యుక్తకర్మచేతా మనుకున్నాడు. బ్రాహ్మణార్థాలు చెయ్యటం మొదలుపెట్టాడు, తద్దినం మంత్రాలూ అవీ నేర్చుకుని.'

'భేష్. మంచిపనిచేశాడు.' అన్నాను.

'ఆ కుర్రవాణ్ణిగురించి నాకుతోచిందికూడా చెబుతాను. వింటావా?'

'చెప్పు.'

'నేను రెండేవిషయాలు చెప్పదలుచుకున్నాను. మొదటిది. రేపు చెట్లూ చేమలూ మనల్నిగురించి తెలుసుకోటం మొదలుపెట్టి అవికూడా మనల్ని అనుకరించాలని ప్రయత్నించేస్తే నేను తప్పకుండా తప్పుపడతాను.'

'రెండోది. మనిషి మూడువిధాలుగా ఉంటున్నాడు—పశువుగా, మానవుడుగా, దేవతగా. పశుత్వంలోనూ మంచీ చెడూ ఉంది, మానవత్వంలోనూ ఉంది, దేవత్వంలోనూ ఉంది (ఈ చివర విషయం బహుశా నీకు తెలీదేమో!) ఇంతవరకూ అందరికీ తెలిసే ఉండవచ్చును. అందరికీ తెలీని విషయమేమిటంటే పశుత్వంలో చెడు చాలాకొద్ది, మానవత్వంలో మంచీ చెడూ చెరిసగంగా ఉంది, దేవత్వంలో మంచికన్న చెడు చాలాజాస్తి.'

ఈ వేదాంతం నాకేమీ అర్థంకాలేదని వేరే చెప్పక్కర్లేదు. కాని వాణ్ణి ఎంతవేడుకున్నా సూరి పైన ఒక్కమాటకూడా మాట్లాడకుండా పేపరు తీసుకుని చదవటం మొదలుపెట్టాడు.

—కొడవటిగంటి కుటుంబరావు.

# సూరిసిద్ధాంతం. ౨.

'డ్రాస్టిక్ స్టెప్స్! స్ట్రాంగ్ మెషర్స్!—' అన్నాడు సూరి.

'తెలుగు ఏడవ్వోయ్! ప్రతిదానికీ వెధవ ఇంగ్లీషు!'

'రైటో! అఘాయిత్యమైన మెట్లు! బలమైన కొలతలు!—'

'వద్దు! వద్దు! ఇంగ్లీషులోనే కానియ్యి.'

'నాకు తెలుగురాదంటే వింటావా నువ్వు? నా సిద్ధాంత మేమిటంటే, ఎవడైనాకానీ కొంత అఘాయిత్యం, మొండితనం చెయ్యకుండా లోకాన్ని జయించలేడు!'

అది నిజంకూడాను. అసలు సూరి వాకింగ్ ఎన్సైక్లోపీడియా. (నాకూ సూరిదుర్గుణం అలవాటుపడ్డది. అట్లాఅని 'నడుస్తున్న విజ్ఞానసర్వస్వం' అంటేమాత్రం ఏమంతబాగుంది?) ఏవిషయమైనా అడగండి సూరి చెపుతాడు. సూరికి తెలుసు. ఆడవాళ్ళు తల్లో పెట్టుకునే సూదులదగ్గిర్నుంచి కాస్మిక్ రేస్, మాడరన్ స్పిరిచువలిజంవరకూ వాడికి తెలీని విషయంలేదు. అయితే వాడి స్ట్రాంగ్ పాయింటేమిటంటే 'గృహచ్ఛిద్రాలు.' ఆ పేరుతో వాడొక పెద్దగ్రంథం రాయటం ప్రారంభించాడు. అది పూర్తిఅయిన తరవాత అన్నిసంసారాలూ చక్కపడగలవు. అంతదాకా మీరంతా ఇదివిని తృప్తిపడవలిసిందే. (సూరిసిద్ధాంతం నిజంగా పనిచేస్తుందా అని అనుమానించేవారికిప్పుడే ఒకముక్క చెప్పేస్తాను. నా పైసంపాదనవిషయం ఇంట్లోవాళ్ళకు అంతుపట్టనివ్వవద్దని సలహాఇచ్చి మాకొంపలో కాస్త శాంతి నెలకొల్పింది వీడే?)

'లోకంలో అనేకరకాల పశువులున్నారు. వాళ్ళను గురించి కథల్లోనూ, నాటకాలలోనూ చదువుతునే ఉన్నాంకాని ఎదురుగావచ్చినప్పుడు చూసీచూడనట్టు ప్రవర్తిస్తున్నాం. ఎందుకు? చిన్నసంగతి చెబుతాను విను. నాస్నేహితుడిచెల్లెలొకపిల్ల ఉంది. అపిల్లభర్త మంచివాడేకాని దేబె. ఉత్తబ్బయ్య. కాపరానికి పోయిందిమొదలు ఆఅమ్మాయిని కుక్కకన్న నీచంగా చూశారంటే నమ్ము. ఆపిల్లవెధవఆడబిడ్డ పనిమనిషిని చూసినట్టు చూసేది. బావగారు భార్యనుచూసినట్టు చూసేవాడు. మామగారు—అమితదురహంకారి—మీదపడి కొట్టేవాడు. మొగుడంతాచూస్తూ ఊరుకునేవాడురా! వాడిసైకాలజీ ఎటువంటిదో మరి! అపిల్లకు సహజంగా ఒళ్ళుమండేది. కాని ఏంచేస్తుంది. ముచ్చటగా మొగుడిచేత సింహాసనం ఎక్కించుకోవలిసిన రోజులలో చీవాట్లూ, చెప్పుదెబ్బలూ!

'చుట్టుపక్కలవాళ్ళంతా చూస్తూ ఊరుకున్నారా అంటావా? ఆయనకు ప్రోత్సాహంకూడా ఇచ్చారేమోనని నా అనుమానం ఆయన చాలాధనికుడు!

'అపిల్ల చాలాపౌరుషంకలది. అందుకని ఎవరితోనూ చెప్పుకోలేదు. మొగుణ్ణిచూస్తే ఉన్నగౌరవం బొత్తిగా పోయింది; కాలానిక్కట్టుపడి ఉంటున్నది. ఇట్లా జరుగుతుండగా అపిల్ల గర్భిణిగాఉండి ఆడపిల్లను ప్రసవించింది. అంతటితో ఆపిల్లకష్టాలు రెండింతలయినై. ఒరే! నే ఒక్కటేచెబుతున్నాచూడు! ఆడపిల్లపుడితే ఏడిచేవాళ్ళకుండే ఒక్కటేశిక్ష! అటువంటివాణ్ణి ఆడవాళ్ళంతా బహిష్కరించి దగ్గిరికి రానీకుండాఉంటేసరి! ముష్టి ఆచారలను అతిక్రమించలేక, ఆడపిల్లపెళ్ళి గొంతుకుఉరల్లే చేసుకుని ఆడపిల్ల పుట్టిందని వలవలా ఏడుస్తారు.

'ఇట్లా కొంతకాలం గడిచిందమ్మా! మాస్నేహితుడి చెల్లెలు మరోఆడపిల్లను కన్నది! శిక్ష! ఏమంటావు? ఆరోజునించీ అపిల్ల పడ్డపాట్లు చెప్పటానికి వీలులేదు. ఈలోపల మాస్నేహితుడివైపువాళ్ళు చూచాయగా పిల్లకష్టాలనుగురించి విన్నారుకాని పిల్లనడిగితే నిర్లక్ష్యంగా ఏమీలేదు పొమ్మన్నది. కాని మాస్నేహితుడుమాత్రం కోపంవస్తే మనిషికాదు. వాడు చాలారోజులు కోపం ఆపుకున్నాడు. మళ్ళీ చెల్లెలు మూడోసారి

ప్రసవించటానికి వచ్చినపుడు ఆపిల్లను నిలవతీసి సంగతి యావత్తూ కనుక్కున్నాడు. ఇంకేముంది ?—అప్పుడు నువ్వయితే ఏంచేస్తావురా ?'

'ఇంకా ఏంచేసేదేమిటి ? ఆముసలాణ్ణీ కొడుకుణ్ణీ చిత్రవధ చేసొస్తాను !'

'తప్పకుండా ! నీ తెలివితేటలు నాకు తెలుసును... సమయానికి నేను దేవుడల్లే వచ్చాను. (మానూరికి మాడెస్టీ అనేది ఏకోశానా లేదని ఇప్పుడే తెలుసుకోండి !) మా స్నేహితుడు కత్తులూ కఠారులూ తీసుకుని ప్రయాణమౌతున్నాడు. వాడి ప్రయాణం ఆపి, వాణ్ణి మెల్లిగా సమదాయించి, వాడిచెల్లెలితో మాట్లాడాను. ఆపిల్లకు మొగుణ్ణిచూస్తే బొత్తిగా అభిమానం పోయింది. కాని మొగుడికి తన్నుచూస్తే ఒకవిధమయిన పిరికిప్రేమ లేకపోలేదన్నది. అంతే నాకు కావలిసింది. అప్పుడే మాస్నేహితుడిచేత బావమరిదికి ఒక ఉత్తరం రాయించాను. నీభార్య, మాచెల్లెలు, తిరిగి ఆడపిల్లను కని అప్రతిష్ఠపడలేక విషంతీసుకుని ఆత్మహత్య చేసుకోటానికి ప్రయత్నంచేసింది. కనుక్కున్నాం. డాక్టరు వచ్చి ఏదోమందిచ్చాడు. పిల్ల అపాయకరమైన స్థితిలో ఉంది' అని.

'ఆఉత్తరం అందినతరవాత ఆపిల్లమొగుడి అవస్థ వర్ణనాతీతం. అది చదువుతూనే మత్తువదిలిన తాచల్లే లేచాట్ట. తల్లినీ తండ్రినీ తిట్టాడు. అన్నమొహాన చేతులో ఉన్న పుస్తకం విసిరేశాడు. తనభార్య బతక్కపోవాలి ఒక్కొక్కరి నెత్తురూ తాగి పేగులు మెళ్ళోవేసుకోకపోతే ఛీ! మాదిగాణ్ణేనని ప్రతిజ్ఞచేసి అత్తవారింటికి పరిగెత్తుకొచ్చాడు. తరవాత చెప్పేదేముంది ? ఆ కాపరం కుదటపడ్డది అతనిప్రతిజ్ఞ మళ్ళీమళ్ళీ విన్నతరవాత మాస్నేహితుడిచెల్లెలు భర్తమీద అభిప్రాయం మార్చుకుని చాలాప్రేమగా ఉండటం మొదలుపెట్టింది. ఇప్పుడాపిల్ల ఆరుగురాడపిల్లలనుకన్న దింతవరకు. అత్తగారూ మామగారూ తమ కసలు మగపిల్లలే అక్కర్లేదన్నట్టు నటిస్తారు, చిన్నకొడుకు చెవిపేటుదూరంలో ఉన్నంతకాలం.'

'నువ్వు చాలా తెలివికలవాడివిరా, నూరీ ! అందరికీ అంత అఘాయిత్యంగా ఉత్తరం రాయటానికి దమ్ముంటుందంటావా ?'

'నన్నేం చూశావు ? నాతల్లోనించి దూరిపోయినవాడున్నాడు అఘాయిత్యానికి. (ఇంకోడిగొప్ప ఒప్పుకునేగుణంకూడా ఉంది నూరిదగ్గర. ఏమాటకామాటే!) పార్వతీశమని. మహాఅందంగా ఉండేవాడు. అతనికి వేలువిడిచిన మేనమామ ఒకడుండేవాడు. ఆయన్ను పార్వతీశంతాత దగ్గిరికి తీసి పెంచటంవల్ల వేలువిడిచిన లక్షణాలేమీ కనిపించకుండా పోయినై. ఆయన కో కూతురున్నది, శారద అని. అందరూ వద్దువద్దంటుంటే ఆపిల్లకు తండ్రి ఎనిమిదోఏట పెళ్ళిచేశాడు, నాకింకా సంవత్సరానికి మారకంఉంది కన్యాదానఫలం దక్కాలి అట్లాఅని. ఆయన కొంచెం చాదస్తమ్మొగుడులే మొదటినించీ! కన్యాదానఫల మాబాగాదక్కింది ! శారద మొగుడు పెళ్ళయిన ఆరునెలల్లోనే చచ్చి ఊరుకున్నాడు. అబాయిలూ, దిబాయిలూ! అందరూఆయన్ను అడ్డమైనతిట్లూ తిట్టారు.


'మొగుడుపోయిన తరవాత మూడునాలుగేళ్ళ కాపిల్ల రజస్వలా అయింది. తనతోటివాళ్ళంతా ఒకరొకరే కాపరానికి పోతుంటే ఆపిల్లకు చాలాదుఃఖంగా ఉండి, తనకూడా తిరిగి ఎందుకు పెళ్ళిచెయ్యరని తండ్రినీ తల్లినీ అడగటం మొదలుపెట్టింది. అటువంటి పనిచేస్తే తనకు రౌరవాదినరకాలు రావటమేకాకుండా తన్ను యావన్మందీ బహిష్కరించి వెలిపెడతారు కనక తను అటువంటి పనిచెయ్యటం కల్లోవార్తఅని తండ్రి ఖచ్చితంగా చెప్పేశాడు.

'శారద కిదంతా ఉన్మత్త ప్రేలాపనల్లేనూ సంధిమాటల్లేనూ ఉండి తనబావ కోఉత్తరంరాసింది. నేను చూశాను కూడాను.

'ఏం, బావా! నన్ను పెళ్ళిచేసుకున్నవాళ్ళూ, చేసినవాళ్ళూ రవరవనరకానికిపోతారా? మానాన్న అంటున్నాడు. ఇదంతా నిజమేనా? నీకు రవరవనరకమంటే భయమేనా? ఎందుకంటే నాకేం భయంలేదు. నువ్వెప్పుడూ ఇక్కడికి రావేం? ఈసారి శలవలకు వస్తావా? తప్పకుండా రా బావా. చాలారోజులుందూగాని. ఏం

నేను పూలుపెట్టుకుంటే ఎంతబాగుంటుందనుకున్నావు. మరి మాఅమ్మ పెట్టుకోనీదుగా. అంచేత మా అమ్మ చూడకుండా పెట్టుకుంటాను. తప్పక రా బావా. ఇట్లు, నీ ప్రియురాలు, శారద.'

'ఇదంతా తెలిసి రాసిందనటానికీ వీల్లేదు; అజ్ఞానంలో రాసిందనటానికీ వీలులేదు. మొత్తానికి ఆ ఉత్తరంచూసి పార్వతీశం ముగ్ధుడైనాడు. ఎట్లాగైనా శారదను చేసుకోవలసిందే ననుకున్నాడు. అతనికి వేలు విడిచిన మేనమామగారింట్లో తనకు కలిగే ఇబ్బందులు స్పష్టంగా తెలుసును. వాటన్నిటికీ సిద్ధమై మరీ బయలుదేరాడు.




'వాకిట్లో బావనుచూడగానే శారద 'ఓ! బావొచ్చాడే, అమ్మా!' అంటూ కేకలుపెట్టి నాట్యం చెయ్యటం మొదలుపెట్టింది. అయితే అంత సంతోషంలోకూడా తనురాసిన ఉత్తరంచూసి వచ్చాడన్నమాట బయటపెట్టలేదు. ఆసంగతి గమనించాడు పార్వతీశం. కాని అతను శారదవంక కఠినంగా చూశాడు. శారద నిర్ఘాంతపోయింది. ఈచర్య ఆపిల్ల కర్థంకాలేదు. అతను తనతో మాట్లాడినప్పుడల్లా కసురుతూ మాటలాడటం చూసి ఇంకా ఆశ్చర్యపడ్డది. ఆమధ్యాహ్నం అతను అత్తతోను, మామతోనూ రహస్యంగా 'శారదాం మరీ మితిమీరుతున్నది. దాని కలుసిచ్చి పాడుచేస్తున్నారు. ఈడొచ్చిన మొగాళ్ళతో అది అట్లా పూసుకుపూసుకు తిరగటం ఎంత అప్రతిష్ట!' అన్నమాటలు వింటే శారదకు గుండెపగలవలసిందే. తనతో బావ సరిగా మాట్లాడకపోయ్యేటప్పటికి శారద మొహం ఇంతచేసుకునిదిగులుగా ఒక మూల కూర్చున్నది. బావకు కోపంవచ్చిందనుకున్నది.

'రెండుగంటలకు శారదతండ్రి స్కూలుకు వెళ్ళాడు. మూడుగంటలకు తల్లి పురాణంచదివేచోట కూర్చుని నిద్రపోయింది. శారదా, బావా మిగిలారు శారద కోపంగా బావదగ్గిరికొచ్చి, 'ఏం, బావా! నా మీద అంతకోపం వచ్చింది. నాతో మాట్లాడవా?' అంది. పాపం పార్వతీశానికి కళ్ళనీళ్ళపర్యంతమయింది.

'ఛీ,ఛీ, పిచ్చిదానా! నాతో అట్లామాటలాడితే మీఅమ్మ కోప్పడదుటే?' అన్నాడు పార్వతీశం.

'అయితే నన్నుచూస్తే నీకు కోపంలేదన్నమాటే!' అంది శారద మొహం అంతచేసుకుని.

'ఎంతమాత్రంలేదు. నువ్వువెంటనే వెళ్ళి తల్లో పూలుపెట్టుకురా!' శారద దొడ్లోకి పరిగెత్తుకుపోయి తలలోపూలు అడ్డదిడ్డంగా కుక్కుకొచ్చింది.

'మొహాన కుంకంబొట్టు పెట్టుకో!' శారద బొట్టు పెట్టుకుంది.

'నాకోచిన్నముద్దుపెట్టూ!...బావనుకాదూ?' శారద ముద్దుపెట్టుకోనిచ్చింది. పార్వతీశం కొసరుకింద గట్టిగా శారదను కౌగిలించుకున్నాడు.

'నన్ను పెళ్ళిచేసుకుంటావా, శారదాం?'

'ఎట్లా? నాన్న ఒప్పుకోడు!'

'మాబాగా ఒప్పుకుంటాడు. నీకు ముట్టునెల ఎప్పుడు? పిచ్చిసిగ్గులుఘడి నాప్రయత్నం పాడుచెయ్యి!

విదియ నాటికా? అయితే ఆనాటికి బయట ఉండను!'

'ఎట్లా?' అంది శారద రహస్యంగా.

'ఎవరితోనూ—మీ అమ్మతో చెప్పకుండా గడిపెయ్యలేవూ మూడురోజులూ?'

'ఇంట్లో కలవనా?'

'మరేమీ ఫరవాలేదు ఒక్కసారికి. నేనావిషయం బాగాచదివాను. డాక్టర్ల నడిగాను. ఏమీతప్పులేదు.'

'తరవాత?'

'నేను చేస్తాను. మనంపెళ్ళిచేసుకుంటే అంతా మన నోట్లో ఉమ్మేస్తారు. ఇష్టమేనా? నేను నిన్ను ఎప్పుడూ ఇంత ఆపేక్షగా చూడకపోవచ్చును. అది కూడా ఇష్టమేనా? నేను నిన్ను కొట్టవచ్చును. ఏం? భేష్!'

మళ్ళీ ఇంకోముద్దుపెట్టుకుని శారదమొహంమీద కుంకంతుడిచి తలలోపూలు లాగేసి, 'నేను మళ్ళీనీతో చెప్పేవరకూ నాతో మాటలాడకు. సరేనా?'

'సరేకాని, నేను పూలుపెట్టుకుంటే బాగాలేను, బావా?'

'చిలకల్లే ఉన్నావు! లేకపోతే నేను ముద్దుపెట్టుకుంటానా? నాతో మాట్లాడకు, మతిమరుపుదానా!'

'చెప్పేదేముంది? పార్వతీశంవేసిన అస్త్రం అమోఘంగా పనిచేసింది. ఏకాదశి గడిచింది, ద్వాదశి గడిచింది. శారద వాకిటఉండలేదు. తల్లీ దండ్రీ రహస్యంగా మథనపట్టం మొదలుపెట్టారు. చాటుగా శారదను పరీక్షచేశారు. ఆపిల్ల ఏప్రశ్నకూ సమాధానం చెప్పలేదు. భ్రూణహత్యామహాపాతకం చెయ్యవలసివస్తుందా ఏమిట్రా భగవంతుడా! ఈ అపవాద భరించట మెట్లాగని శారదతండ్రి వాపోవటం మొదలుపెట్టాడు.

'సనాతనధర్మాన్నిగురించీ, మతాచారాలనుగురించీ, విధవావివాహాలుచెయ్యటంయొక్క బుద్ధితక్కువను గురించీ ఇన్నిరోజులనించీ పార్వతీశం ఇస్తున్న ఉపన్యాసాలు మేనమామమనసున నాటి ఆయన కతన్ని చూస్తే మంచిగురి ఏర్పడ్డది. ఈవిషయం అతని సలహా అడగవలసిందే ననుకున్నా డాయన.

'చాలాసేపు విషయం అర్థంకానట్టు నటించాడు పార్వతీశం. తరవాత మండిపడి మామను తిట్టటం మొదలు పెట్టాడు,

'మీచనువులూ, ఆపేక్షలూ నాకర్థంకావు. మీ నూక్కాలుపిల్లల కళ్ళన్నీ ఈ ఇంటిమీదనే ఉంటున్నై. అటువంటప్పుడు ఎంతజాగ్రత్తగా ఉండాలి? అయ్యయ్యో! ఎంత అపకీర్తి! ఎంతపాపం! శిశుహత్యచేసి నరకానికి పోతావా? చెయ్యక అపవాదుపడతావా? రౌరవాదిమహానరకాలు—'

'మామగారిశరీరం కంపించి ముచ్చెమటలు పొయ్యటం మొదలుపెట్టింది. 'ఉండరా! నాయనా! నాకీ ఆపదతప్పే ఉపాయంచెప్పు! నీయింట కుక్కనైపుట్టి నీరుణం తీర్చుకుంటాను!'

'అవకతవక పనులన్నీచేసి ఉపాయంఅడిగితే ఏం చెప్పను. నావల్లకాదు' అన్నాడు పార్వతీశం.

'శారద తల్లిదండ్రుల అవస్థ వర్ణనాతీతం. పార్వతీశం వాళ్ళను కొంతబాధపడనిచ్చి 'ఒక్కఉపాయం లేకపోలేదు,' అన్నాడు.

'ఏమిటది? ఏమిటది?' అన్నారు శారద తల్లిదండ్రులు ఏకగ్రీవంగా.

'ఎవరికైనాఇచ్చి వెంటనే పెళ్ళిచేస్తేసరి! అపవాదు తప్పుతుంది. నరకంఎట్లాగూ తప్పదు.'

'ఎవరు చేసుకుంటారు?'

'దాన్ని గుంటూరు తీసికెళ్ళి ఎవరికైనాచూసి అంటగడతాను.' ఈ ఏర్పాటుకు అంతా ఒప్పుకున్నారు. శారదకూడా.

'శారదనుతీసుకుని పార్వతీశం గుంటూరువెళ్ళాడు. పదిహేనురోజుల కతనిదగ్గిర్నించి ఉత్తరంవచ్చింది.

'మామగారికీ, అత్తగారికీ నమస్కారములు. ఎంత వెతికినా శారదాంకు మొగుడు దొరకలేదు. ఇక తప్పక నేనే చేసుకున్నాను. అందుకోరకు మీరు నాకు చాలా కృతజ్ఞులై ఉండవలెను...చెప్పటం మరచిపోయినాను. ఇవాళే శారద వాకిటఉంది. రౌరవనరకంవిషయం మీ కిక ఏమాత్రం భయం అవసరంలేదు.'

'ఒక్కసంగతిమాత్రం చెప్పాలి. వాళ్ళిద్దరూ ఈ నాటికీ చాలా అన్యోన్యంగా ఉంటున్నారు—మనలో చాలామందికి చాతకానివిద్య!'

'కనక ఉంటారు!' అన్నాను.

'అవును! లేకపోరు!' అన్నాడు సూరి.

—కొడవటిగంటి కుటుంబరావు.

# సూరి సిద్ధాంతం. ౩.

"బ్రాహ్మణుల సంగతి ఏమయిందిచెప్పు! ఒకప్పుడు వాళ్ళలో ఈజీవశక్తి ఉండదగినంతఉండే ఉండాలి. అప్పుడు వాళ్ళు తమచేతులోఉన్న కర్మయోగాన్ని పట్టుకు ఏడవక, లక్షమందిలో ఒకడికికూడా అందని జ్ఞానయోగంకోసం పోయినారు. అమితిమీరిన తిండితో జీవశక్తి మందగించిపోయింది. తద్దినాలుపెట్టించే దేవతాస్వరూప బ్రాహ్మణుడిమొహం చూస్తే నీకు జఠరాగ్నిమందగించిన లక్షణాలే కనబడతై; నాకు జీవశక్తి మందగించిన చిహ్నాలుకూడా కనబడతై. ఈకాలపు బ్రాహ్మణుడు కర్మచెయ్యలేడు. ఆకలిలేనివాడికి ఏపదార్థం రుచించనట్టు ఈబ్రాహ్మడికి ప్రతీపనీ తప్పుగా కనబడుతుంది. మడికట్టుకునివస్తుంటే కాస్తపోగు కాలికిందపడగానే వెళ్ళి మళ్ళీ స్నానంచేసివస్తాడు. తనలో జీవశక్తి చచ్చిపోయిందికనక, తన ఆటలు సాగుతున్నైకనక, ఇంకాజీవశక్తి చావని ఇతరకులాలవాళ్ళను ఏపనీ చెయ్యవద్దంటాడు—ఆకలికానివాడు మాడుతున్నవాణ్ణి అన్నంతిననివ్వక పక్కనచేరి అన్నంలో మట్టిగడ్డలు చూపించి అన్నంపారెయ్యమన్నట్టు! ఇతరులుచేసేకర్మకు తనెట్లా బాధ్యుడో?—తనశాస్త్రంప్రకారమే చూసినా!...సనాతనమతంఅన్నవాడినల్లా జైలులో పారెయ్యి! ఒక్కసంవత్సరంలోపల ఈహరిజనుల్లోనుంచి సూపర్‌మాన్ రాకపోతే నాపేరు సూరికాదు!...ఈసారి గాంధి వాళ్ళలోపుడితే ఆశ్చర్యంఏముంది?"

ఒకప్పుడు నేను మనుష్యులంతా మంచివాళ్ళూ చెడ్డవాళ్ళూ రెండురకాలుగా ఉంటారనుకునేవాణ్ణి. కాని మనుష్యులతో నాకు సంపర్కం ఎక్కువయినకొద్దీ ప్రతివాడిలోనూ మంచీచెడూ ఉన్నదని గ్రహించాను. ఇదొక పెద్ద డిస్కవరీకాదు కాని దీనిమీద కొంత బుద్ధిని ప్రయోగించి నిజమైనడిస్కవరీ ఒకటి చేశాను. మొత్తానికి బుద్ధిని ఉపయోగించటాన్ని గురించి సూరి చెప్పినదాన్లో కొంతలేకపోలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా ఈడిస్కవరీనిగురించి సూరితో ఎప్పుడు చర్చించుదామా అని ఆరాటపడ్డం మొదలుపెట్టాను.

మర్నాడుదయం మొదటికిత్తా పడ్డ తరవాత ఇద్దరం తీరిగ్గా కూర్చున్నాం.

"ఒరే సూరీ! నేనోకొత్తవిషయం కనిపెట్టాను!" అన్నాను.

"ఏమిట్రా అది?" అన్నాడు సూరి పరధ్యానంగా.

'కృతయుగంలో ధర్మం ఒంటికాలిమీద నడుస్తుందనీ రానురాను కలియుగంలో ఒకపాదంతోనే నడుస్తుందనీ నువ్వు నమ్ముతావా?'

'ఒక్కకాలితో నడవటం ఎట్లాఉంటుంది? గెంతుతుందను.'

'ఏడిచావులే! నామాటకు సమాధానంచెప్పు. నీకటువంటి నమ్మకంఉన్నదా?'

'ఆ! ఏం?'

'మరేంలేదు! నేనదిశుద్ధ అబద్ధమని నిరూపిస్తాను.'

'నిరూపించు!' అన్నాడు సూరి ఆశ్చర్యంతో. ప్రతిరోజూ వాడి ఉపన్యాసాలకు గురిఅయే నేను వాడికి లెక్చరివ్వటానికి చాలాగర్వపడ్డాను—కొద్దిగా భయపడ్డాను. మరేంలేదు. దొంగవెధవ! ఏదోవాదన పెట్టి మనడిస్కవరీలు డిస్కవరీలుకావని నిరూపిస్తాడు! మరోవిషయమేమిటంటే వాడు పురాణాదులతో ఏకీభవిస్తున్నాడంటే ఏదోదొంగఎత్తు ఎత్తాడన్నమాటే! ఎందుకు? ఒకసారినేను మనపురాణాలంత నమ్మదగినట్టుండవన్నాను. వాడిట్లాగే కళ్ళుపెద్దవిచేసి అమాయకుడల్లే 'ఏం?' అన్నాడు. నేను ప్రహ్లాదచరిత్ర తీసుకుని, ప్రహ్లాదుడు చావకపోవటం, భగవంతుణ్ణి ఎక్కడపడితే అక్కడ చూపిస్తానని చూపించగలగటం, హిరణ్యకశ్యపుడు శాస్త్రోక్తంగా చచ్చిపోవటం మొదలైనదంతా సింబాలిక్ కాని కథ ఎంతమాత్రం నమ్మటానికి వీల్లేదన్నాను. ఇక సూరి తగిలాడు కాబూ! ప్రహ్లాదచరిత్రలో ప్రతి అక్షరం ట్రూటు

లైఫ్ అన్నాడు. ప్రహ్లాదుడు క్లియర్‌గా సైకిక్ మీడియమ్ అన్నాడు. ప్రహ్లాదుడు చేసిన పనులలో మామూలు క్లేర్‌వాయంట్లు చెయ్యలేనివేవీ లేవన్నాడు. నరసింహమూర్తి ప్రత్యక్షంకావటం అన్‌ది వెరీఫేసాఫిట్ మెటీరియలైజేషన్ అన్నాడు. తండ్రిని చంపేటందుకు కావలిసొచ్చిన మెటీరియల్ ఎనర్జీయావత్తూ ప్రహ్లాదుడే సప్లయిచేశాడన్నాడు. ప్రహ్లాదుడే మళ్ళీ డిమెటీరియలైజేషన్ కూడా చెయ్యగలిగాడు చూడమన్నాడు. ఈ ప్రవాహానికి ఏమడ్డువెయ్యను? అసలే నాకీస్పిరిచుఅలిజంఅంటే అమితఅనుమానం. తరవాత దాన్నిగురించీ నాకు ఏమీతెలీదు. ఇప్పుడుకూడా ఇటువంటి దొంగఎత్తుఎత్తి కలియుగంలో ధర్మం గెంతుతున్నది కాని నడవటంలేదని నిరూపిస్తాడని నాకుఒక చెంప అనుమానం ఉండనే ఉంది... నా ఉపన్యాసం ప్రారంభించాను.

'వెనకటియుగాల్లో అంతా సజ్జనులయినప్పటికీ, అందరి మంచితనాన్ని కప్పిపుచ్చగల ఒకదుర్మార్గుడుండేవాడు. ఆరోజుల్లోఅయితే రాముడూ లేకపోతే రావణుడూ! ఒక్కొక్క కంటకుడు అనేక వేలసంవత్సరాలు భూమిమీద ధర్మంఅన్నమాట వినపడకుండా చేసేవాడు. ఇప్పుడో? ఇప్పుడు రావణుడూలేడు. రాముడూలేడు. ప్రతివాడులోనూ కొంతరాముడూ కొంత రావణుడూ ఉన్నాడు. నీకృతయుగంకంటె ఈ కలియుగమే బాగుంది—నన్నడిగితే!' అన్నాను.

సూరి 'హో! హో!' అంటూ వాడిపెధవనవ్వు నవ్వటం మొదలుపెట్టాడు.

నాకు ఒళ్ళుమండి 'ఎందుకురా ఆపెధవనవ్వు? చాతయితే నేను ఏంపొరపాటుపడ్డానో చెప్పు!' అన్నాను.

వాడు యథాప్రకారం 'సారీ!' అని నన్ను ఖండించటం మొదలుపెట్టాడు.

'ఓరి పిచ్చిసాయనా! నువ్వు రావణుడివైనా రాముడివైనా నీకు సృష్టిలో స్థానంఉంది. ఆరెండుశక్తులూ నీలో ఏకమైపోగానే నీలో లైఫ్‌ఫోర్సు చచ్చిపోయింది. నిన్నుమళ్ళీ కరగవెయ్యవలిసిందే. ఇబ్సెన్ రాసిన పీర్ జెయన్‌ట్ చదువు.'

నేను కష్టపడి అర్ధరాత్రివేళ నిద్రలేకుండా చేసిన రిసర్చి యావత్తూ సూరి ఒక్కముక్కతో తేల్చివెయ్యటం నాకిష్టంలేకపోయింది. నేను వాడితో లడాయి వేసుకున్నాను.

'ఒరే సూరీ! నీపెడకట్టెతర్కం నాదగ్గిర పనికిరాదు. సృష్టియొక్క ఆదర్శమేమిటి? మంచితనమా, దుర్మార్గమా?'

'నే నావిషయం ఇంకాసృష్టినడిగి తెలుసుకోలేదు. సృష్టిలో వెల్తురూఉన్నది, చీకటీఉన్నది. ప్రకృతికి వెలుతురునుచూస్తే ప్రేమగాని, చీకటిని చూస్తే కోపంగాని ఉన్నట్టు తోచదు.

'జయవిజయులను దుర్మార్గులుగా పుడతారా సన్మార్గులుగా పుడతారా అని అడిగితే తడుముకోకుండా దుర్మార్గులుగా పుడతామన్నారు ఒక్కజన్మలో భగవంతుణ్ణి చేరుకోటానికైనాసరే నీవంటివాడుగా పుట్టటానికంగీకరించి ఉండరు. నామాట నమ్ము. స్వర్గానికీ నరకానికీ దారి ఒకటేనని వాళ్ళకు తెలుసు.'

నేను కాస్సేపు ఆలోచించాను.

'అయితే స్వర్గం నరకం ఒకటేనంటావా? పుణ్యం పాపం ఒకటేనంటావా?'

'మంచీచెడూ ఒకటేనన్నానా? కాదు! నేనన్నదల్లా త్రిశంకుస్వర్గంకన్న నరకమైనా మంచిదేనన్నాను. నీకన్న ఒక రావణుడికెక్కువపదవి ఉందన్నాను ప్రపంచంలో. ఏదోకర్మచెయ్యి, అజగరవ్రతం మంచిది కాదన్నాను.'

'అట్లాఅయితే నువ్వువర్మీ ఒప్పించలేవు. ఏపనీ చెయ్యకుండా ఉండటం మంచిదంటాను పాడు పని చేసేకన్న!'

'నువ్వు పాడనగానే సరా? నీకు మంచిచెడ్డలను గురించి ఏంతెలుసో చెప్పు. నీకిష్టమైనదంతా మంచీ నీకిష్టంకానిది చెడూ అనుకునేవాడివి మంచిచెడ్డలతో ఏంపనిరా?...నాకు అర్థంరాదు! అట్లాకాకుండా, నీకుమంచి చెడ్డల్లో స్వర్గనరకాల్లో నమ్మకంఉందా? నీకు మంచినిచూస్తే ఇష్టమెందుకు? చెడును చూస్తే అసహ్యమెందుకు?'

'దుష్టుడికి దూరంగా ఉండమన్నారు.'

'నీకర్మఅంటూ ఒకటిఏడిస్తే ఏదుష్టుడు నీపక్క-

ఉన్నా, నిన్నేమీ చెయ్యడు. నీకు నీకర్మ అంటూ లేదు. నువ్వు దుష్టుడికి దూరంగా పోయి నిర్వ్యాపారత్వం వాతపడి త్రిశంకుస్వర్గం చేరతావు.

'ఒక్క ఉపమానం చూడు నీలో ఆకలంటూ ఒకటి పుట్టినప్పుడు ఏదో తింటావు. అది మంచిపదార్థమయితే నీకు సహాయం చేసి బలం ఇస్తుంది. అది అరగని పదార్థమయితే కడుపులో నెప్పి వస్తుంది. దానికి మందు పడవలసి వస్తుంది. అది డాక్టరు చేతిమీదిగా ఇవ్వబడటం ప్యూర్ ఆక్సిడెంట్. నీకే ఆ చికిత్స చాతయి ఉండవచ్చును. అప్పు డామందు నువ్వే పుచ్చుకుని బాగుపడతావు. ఆవిధంగానే నీలో జీవశక్తి, లైఫ్ ఫోర్స్ ఉంది, జఠరాగ్ని మాదిరిగానే. అది లోపల ప్రజ్వరిల్లుతూంటే ఏదో కర్మ చెయ్యకుండా ఊరుకోలేవు. నువ్వు అన్నం తినేటప్పుడు తెలివిగలవాడివైతే నీకరిగే పదార్థాలు చూసి మరీ తింటావు. నీకరిగే పదార్థాలు—గమనించు! ఇంకొకడితో సంబంధం లేదు! ఆ విచక్షణ లేకపోతే కడుపులో నెప్పి వచ్చినట్టుగానే నువ్వు నరకం అనుభవిస్తావు. (ఆ నరకం యొక్క తత్వం తరవాత విచారిద్దాం.) దానిక్కూడా మందు కావలసి వస్తుంది. అది నువ్వే తీసుకోవచ్చును లేదా తెలిసినవాళ్ళు నీకామందివ్వవచ్చును. నీలో ఆ లైఫ్ ఫోర్సు—ఆ జఠరాగ్ని లేకపోతే నువ్వెందుకు పనికొస్తావు?

'ఇక ఒక్క క్షణం మనవాళ్ళు చెప్పే నరకాన్ని గురించి ఆలోచిద్దాం. మనవాళ్ళు చెప్పే నరకం ఖయిదు మోస్తరుగా ఉన్నది. నువ్వు అరగని పదార్థాలు తిని కడుపు నెప్పితో బాధపడుతున్న వాడవల్లే లేవు. దొంగతనం చేసి విచారింపబడి ఖయిదు అనుభవిస్తున్న వాడల్లే ఉన్నావు. ఒక్కటాలోచించు. ఈ జైళ్ళు ఏ క్షణం పోయినా పోవచ్చును. అది శాశ్వత సంస్థ కాదు. మనం పెట్టుకున్నది. మనం తీసేసేది. ఈ కడుపులో నెప్పి? ఇది శాశ్వతం. డాక్టరు శాశ్వతం. మందు శాశ్వతం. పైగా మనిషి నిపట్టి రోగం. రోగిని పట్టి మందు. డాక్టరు నామమాత్రం. వరసగా నూరుమంది దొంగలను తీసుకురా. అందరూ ఒకో ఒక్క రూపాయి దొంగతనం చేసినవాళ్ళనుకో మాటవరసకు. నీకు న్యాయం ఏమాత్రమైన తెలిసుంటే అందరికీ ఒకటే శిక్ష ఇస్తావా? ఎప్పుడు ఇవ్వవు. తల కొకపదిజామకాయలచొప్పున ఒక వందమందికివ్వు. అందరికీ కడుపు నెప్పి వస్తుందా? రాదు. అరిగించుకునే శక్తి ఉన్నవాడు పదిజామకాయలు తీసుకున్నందుకు ఎందుకు శిక్షపడాలి? నేను అరగని పదార్థమే తిన్నాననుకో. ప్రకృతి నాకు కడుపు నెప్పి ఇవ్వటం సహజం కాని, దొంగలుపడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగినట్టు, తిన్న యాభైసంవత్సరాలకు నేను చచ్చి యమధర్మరాజు దగ్గిర నన్ను విచారించి "అబ్బాయి, మా చిత్రగుప్తుడి లెక్కప్రకారం నువ్వు యాభైసంవత్సరాల ఆరునెల్ల పదిరోజులకింద ఉదయం నాలుగు ఘడియలవేళ పదిజామకాయలు తిన్నావుట! అట్లా నరకంలోకి వెళ్ళి కాస్త కడుపు నెప్పి అనుభవించిరా!" అంటే! నాకు కావలిసింది. డాక్టరు! ఆసుపత్రి!—'

'మనవాళ్ళు చెప్పే నరకం నీ ఆసుపత్రే నేమో?'

'అట్లా అయితే ఆరోగాలు నయంచేసే పంపిణీ ఉండవలిసినట్టు ఉండక మన ఆసుపత్రుల్లో ఉన్నట్టే ఉందన్నమాట, ఆ డాక్టర్లు మన డాక్టర్లకంటే రొండాకు లెక్కువ చదివినవాళ్ళన్నమాట!...అటువంటి ఆసుపత్రిలోకి పొయ్యేకన్న రోగమే అనుభవిస్తాను. నాకు మందిచ్చే డాక్టరుకు నన్ను చూస్తే జాలిలేకపోతే, నేను పడుతున్న బాధయందు సానుభూతి లేకపోతే నాకు రోగం నయం కానక్కరలేదు.'

నేను కొంత కంగారుపడ్డాను. సూరి కడుపునెప్పి నొకదాన్ని లాక్కొచ్చి మాట్లాడే మాటలన్నీ ఆముదం కంపు చేశాడు.

'ఆకలయితే అన్నం తినటానికీ, నువ్వు చెప్పే పుణ్యపాపాలకీ నువ్వనుకున్నంత సంబంధం లేదేమో?' అన్నాను.

'మళ్ళీ జాగ్రత్తగా విను! మట్టిబుర్ర! నీలో జఠరాగ్ని ఉన్నట్టుగానే లైఫ్ ఫోర్స్—తెలుగు తెలీదు! జీవశక్తి అందాం—కూడా ఉంది. ఏమీబాదగ్గిరనించీ రకరకాల జీవకోట్లన్నీ చూస్తూవస్తే ఈ జీవశక్తి మనిషిలో ఎక్కువగా ఉంది. రేపు మనిషిలో ఉన్న జీవశక్తి కంటె ఎక్కువ జీవశక్తిగల కొత్తప్రాణి ప్రపంచంలోకి

రావచ్చును. వాణ్ణి సూపర్ మాన్ అను, దేవతను. వాడి భావాన్ని దేవత్వంఅను. మొత్తానికి ఈఆదిమానవుడి ఛాయలు అప్పుడప్పుడూ కనిపించకపోవటం లేదు. నీకన్న తక్కువలైఫ్ ఫోర్స్‌గల జంతువుయొక్క మంచి చెడ్డలు నీకెట్లాచాలవో, నువ్వు ప్రపంచంలో అడుగుపెట్టగానే ఇతరప్రాణికోటిని నీలైఫ్‌ఫోర్సుతో ఎట్లా పక్కకు నెట్టేశావో, అట్లాగే రాబొయ్యే సూపర్ మాన్ నిన్ను అట్లాగే నెట్టేస్తాడు. నువ్వు అసంభవమనుకుంటున్న పనులన్నీ చేస్తాడు. ప్రపంచకంలో అందరూ సుఖంగా బతకదగినన్ని పదార్థాలున్నాకూడా కొందరు మాడిచస్తుంటే నువ్వు వాళ్ళకు భోజనసదుపాయం చెయ్యలేక గుడ్లుపెట్టుకు చూస్తున్నావు. రాబొయ్యేవాడి కది చాలాసులభం. ప్రపంచంయావత్తూ ఒక్కటేసంస్త చెయ్యగలశక్తి వాడికుంటుంది. వాడిలోనూ చెడుఉంటుంది. అదిఎట్లాఉంటుందో వాడి బోటివాళ్ళు చెప్పవలిసిందే. నీలోచెడు నీకన్నతక్కువ లైఫ్‌ఫోర్స్‌గల జంతువులకేం తెలుస్తుంది. వాణ్ణి చూడగానే నీఒకదేవుడితియరీ మర్చిపోయి వాడికాళ్ళమీద పడతావు—ఇప్పుడు వాడి ఛాయలకాళ్ళమీద పడుతునే ఉన్నావు!

'ఇకతిన్నది అరక్కపోవటం విషయం మాట్లాడదాం. నీకాకలిగాఉన్నప్పుడు తినదగిన దానికన్న ఎక్కువ తింటూవస్తే నీలోఉన్న జఠరాగ్ని చచ్చి మాంద్యం ఏర్పడుతుంది. బ్రాహ్మణుల సంగతి ఏమయిందిచెప్పు! ఒకప్పుడు వాళ్ళలో ఈజీవశక్తి ఉండదగినంత ఉండేఉండాలి. అప్పుడు వాళ్ళు తమచేతులో ఉన్న కర్మయోగాన్ని పట్టుకు ఏడవక, లక్షమందిలో ఒకడికికూడా అందని జ్ఞానయోగంకోసం పోయినారు. అమితిమీరిన తిండితో జీవశక్తి మందగించిపోయింది. తద్దినాలుపెట్టించే దేవతాస్వరూపబ్రాహ్మణుడి మొహంచూస్తే నీకు జఠరాగ్ని మందగించిన లక్షణాలే కనపడతై; నాకు జీవశక్తి మందగించిన చిహ్నాలుకూడా కనపడతై. ఈకాలపు బ్రాహ్మణుడు కర్మచెయ్యలేడు. ఆకలిలేనివాడికి ఏపదార్థం రుచించనట్టు ఈ బ్రాహ్మడికి ప్రతిపనీ తప్పుగా కనపడుతుంది. మడికట్టుకుని వస్తుంటే కాస్తపోగు కాలికిందపడగానే వెళ్ళి మళ్ళీ స్నానంచేసివస్తాడు. తనలో జీవశక్తి చచ్చిపోయింది కనక, తనఆటలు సాగుతున్నైకనక, ఇంకా జీవశక్తి చావని ఇతరకులాలవాళ్ళను ఏపనీచెయ్యవద్దంటాడు—ఆకలికానివాడు మాడుతున్నవాణ్ణి అన్నంతిననివ్వక పక్కనచేరి అన్నంలో పుట్టిగడ్డలు చూపించి అన్నం పారెయ్యమన్నట్టు! ఇతరులుచేసే కర్మకు తనెట్లా బాధ్యుడో?—తనశాస్త్రంప్రకారమే చూసినా!

'ఇక రోడ్డుపక్కన కూర్చుని దీనంగా చెప్పులు కుట్టేవాడి గతిచూడు. వాడిమొహంలో ఆకలితీరే అన్నంతిననివాడి లక్షణాలున్నై. పాపం, మానవుడు నిర్మించిన యాభైఅంతస్తుల మేడల్లో, డెబ్భైమైళ్ళ వేగంతో పొయ్యే రైళ్ళలో, మూడొందలు గంటకు పొయ్యే కార్లలో, విమానాల్లో, వేదాంతగ్రంథాల్లో, దాన్లో, దీన్లో, వాడి కేం భాగంఉంది? వాడిలో జీవశక్తిని చూస్తే ఎవరికీ గౌరవంలేదూ? వాడిమొహాన మనపాదధూళేనా? వాడిఆకలిని సారాయితోనూకల్లుతోనూ తృప్తిపరిచి, ఏకొలుపులో జరిగినపుడు వేటలు నరికి సంతోషించవలిసిందేనా? వాడా స్తితిలో ఉండటానికి సమ్మతిస్తే బాగానేఉండును. అట్లా జరుగుతున్నదా? అన్నం తిననివ్వమన్నామా అని అంటే ఏం లాభం, కంచంకూడా ముట్టుకోనివ్వకుండా! వాణ్ణి నీకు ఆరడుగులదూరంలో పోనివ్వవు! వాడిలో లైఫ్ ఫోర్సు ఇంకా ఎట్లా చంపాలి?'

సూరి ఉద్రేకంపట్టలేక లేచి అటూఇటూ పచారు చెయ్యటం మొదలుపెట్టాడు. వాడిమొహం క్రోధంతో భయంకరమైపోయింది.

'మై-గాడ్! సనాతనమతం అన్నవాడినల్లా జైలులోపారెయ్యి! ఒక్కసంవత్సరంలోపల ఈహరిజనుల్లో నుంచి సూపర్ మాన్ రాకపోతే నాపేరు సూరికాదు! బంగారంకావాలంటే పాడుపడ్డ గనులే మళ్ళీమళ్ళీ వెతికితే ఏంప్రయోజనం? కొత్తచోట వెతుకు. వాళ్ళ పాసిబిలిటీస్ పరీక్షించినవాడేడీ? ఈసారి గాంధి వాళ్ళలో పుడితే ఆశ్చర్యంఏముంది!'

—కొడవటిగంటి కుటుంబరావు.

# సూరి సిద్ధాంతం. ౪.

అన్నిదశలలోనూ బాల్యదశవంటిదిలేదని నేను సూరితో వాదించాలని ఒకసారి ప్రయత్నంచేశాను. సూరి నాతో వాదించక, తన బాల్యాన్నిగురించి అదివరకు రాసిఉంచిన వ్యాసంచూపించి, 'ఇదిచదువు. తరువాత నీ అనుమానాలు తీరుస్తాను,'' అన్నాడు. ఆవ్యాసం ఈ కింది విధంగాఉంది.

...అనేకమంది బాల్యావస్థను శ్లాఘించగా విన్నాను. ''చిన్నప్పటి ఆనందం—ఆరోజులు—మళ్ళీ రాదుకదా.'' అని నిట్టూర్చటంచూశాను. క్రీస్తు కూడా వాళ్ళదే స్వర్గమన్నాడు...గ్రే ఒక్కొక్కసారి అజ్ఞానం పరమానందమన్నాడు.

నేనీఅభిప్రాయాలతో ఏకీభవించక పోవటంలేదు. నాబాల్యం, దాన్నిపొగమాదిరిగా ఆవరించుకుని ఉండిన అజ్ఞానం ఇప్పుడు తలుచుకోటానికి నాకు దుర్భరంగా ఉంటుంది. పరిపూర్ణమైన జ్ఞానానికితప్ప స్వర్గంలో తావులేదని నామతం. అజ్ఞానంకన్న బాధలేదని ప్రత్యక్షంగా చూస్తున్నాను. ఏదేవుడైనా నాకు వరమిస్తే బాల్యంలేని జన్మ ప్రసాదించమని వేడుకుంటాను.

ఇటువంటి పొరపాటు అభిప్రాయాలుకలలోకాన్ని దూషించి ప్రయోజనంలేదు. ఆపరేషన్ బల్లమీద రోగి బాధకువోరచి డాక్టరును క్లోరోఫారం ఇమ్మని బతిమాలినట్టుగా, రోజల్లా శరీరకష్టంచేసినవాడు కల్లుదుకాణానికిపోయి తప్పతాగినట్టుగా, నిజాన్ని ఎదుర్కోలేనిలోకం అజ్ఞానంలో ఆనందించటంలో ఆశ్చర్యం లేదు.

అజ్ఞానానికి అబద్ధానికి జరిగేప్రచారం లోకంలో మరిదేనికీ జరగటంలేదు...చిన్నతనంలో పిల్లలకు పెద్దవాళ్ళనుచూస్తే భయభక్తులు నేర్పుతారు.

''అమ్మోయ్! తాతదగ్గిర పొడుంవాసనే!''అంటాడు పిల్లవాడు. వెంటనే తల్లి ''ఛా!వెధవా! అట్లా అనవచ్చునా? ఛీ!'' అని భయపెడుతుంది. తెలివిగల పిల్లవాడైతే తిట్లూదెబ్బలూ తప్పించుకోటానికి మరోమాటు ఆమాట అనకపోయినా, తాతదగ్గిర పొడుంవాసన అనేమాట మరిచిపోడు. అదే మెదడులేని పిల్లవాడైతే ఆమాట అనటం పెద్ద అపరాధమని గ్రహించి, మానసికంగా చెంపలు వాయించుకోటమే కాకుండా, నిజంగా తాతదగ్గిర పొడుంవాసనలేదనే నమ్మకంతెచ్చిపెట్టుకుంటాడు.

సహజంగా మనం మొదటిరకం పిల్లవాణ్ణి అల్లరివెధవఅంటాం, రెండోరకంవాడు బుద్ధిమంతుడు!

ఎంతబుద్ధిమంతుడైన కుర్రవాడు కానివ్వండికాక, స్వతహాగా పంతులుకనపడితే నమస్కారంచెయ్యాలని కనుక్కోగలడా? ఇంకోరుచెప్పకుండా కిందనుంచోటంకన్న బెంచీఎక్కటం హీనమని గ్రహించగలడా?

నేను వీధిబడి వదిలి హైస్కూలులో తక్కువ తరగతిలో ప్రవేశించిన మొదటిరోజునే ఒక చిత్రం జరిగింది. క్లాసులోకి మేస్టరురాగానే అంతా లేచినుంచున్నారు. నాకిది అర్థంకాక నాపక్కవాణ్ణి బలవంతాన లాగాను. వాడు నాపక్కన కూలబడి మళ్ళీబంతిల్లే లేచి దణ్ణంపెడుతూ ''చూడండీ సార్!'' అని మేస్టరుతో ఫిర్యాదుచేశాడు. ఆయన నేను లేవనికోపం లోపల పెట్టుకుని బెంచీ ఎక్కమన్నాడు. బెంచిమీద ఎక్కగానే ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది నాకు...తరవాత చాలారోజులవరకూ పంతులు క్లాసులోకి వచ్చినప్పుడు లేచి నమస్కారం చెయ్యాలనీ, బెంచీఎక్కడం కిందనిలబడటంకన్న పెద్దశిక్షఅని నమ్మలేకపోయినాను!

ఈ చిన్నతనాన్నిగురించి ఎట్లా గర్వపడటం?...

గట్లమధ్య ప్రవహించే నది మాదిరిగా కుర్రవాడిప్రకృతి తల్లి ప్రకృతిని ఒరుసుకుంటూ తల్లిదండ్రుల యొక్క ప్రకృతులమధ్యగా ప్రవహిస్తుంది. (ఈపోలిక పోల్చటంలో కుర్రవాడిప్రకృతి గట్టు తెగిపోవచ్చునని కూడా ఉద్దేశం.) తల్లికీ పిల్లవాడికీ బంధం జాస్తి. ప్రవా

హానికి వెలపలిగట్టుతో సంబంధంతక్కువ. లోపలిగట్టు ఎన్నివంకర్లుతిరిగితే ప్రవాహం అన్నివంకర్లు తిరుగుతుంది. తల్లుల్లో ఎన్నిలోపాలుంటే పిల్లవాడు అన్నిలోపాలతోనూ బాధపడతాడు. ఆడదాన్ని చేతులారా దాస్యంలోఉంచుతున్న ఈ వివాహచట్టంతోనూ ఈ న్యాయచట్టంతోనూ, ఆడదాన్ని, పిరికిదాన్ని, చేసేస్తున్న తండ్రి దౌర్జన్యంతోనూ భర్త దౌర్జన్యంతోనూ, ఆడదాన్ని పశువుకన్న హీనంచెయ్యాలని ప్రయత్నం చేస్తున్న మత సంబంధమైన మోసంతోనూ స్త్రీ ధర్మశాస్త్రాలమోసంతోనూ, మనదేశంలో పిల్లలు ఎందుకైనా పనికిరావాలంటే ఉన్నతల్లులు తమపిల్లలతో రోజుకు గంట గడపటానిక్కూడా అర్హులుగాలేరు. . .

నాకు మానాన్నగుణాలు అబ్బినా అయన్ను చూస్తే ఒకవిధమైన వైరభావం, మా అమ్మనుచూస్తే ప్రేమా ఉండేది. ఆవిడమీద ప్రేమకు ప్రకృతిసిద్ధమైన స్త్రీ పురుషపరస్పరాకర్షణ కారణం కావటమేకాక ఆవిడ అభిప్రాయాలూ ఆవిడ అజ్ఞానం నా ప్రవర్తనలో లైన్ ఆఫ్ లీస్ట్ రెసిస్టెన్సుకు చాలా అనుకూలంగా ఉండేవి. కుర్రవాడికి ఏదైనా నేర్చుకోటానికి, సరిగా ప్రవర్తించటానికి ప్రయత్నంకావాలి కాని వృద్ధిలేకుండా ఉండటం చాలా సులభం. అందరికీ సహజమైన ఈ బద్ధకం, ఈ ఇనర్షియా, నన్ను వృద్ధిలేకుండా ఉండమని ప్రేరేపించేది. మా నాన్నకు అది ఇష్టమని నాకు ఎట్లాగో తెలుసును. ఆయనదగ్గిరికి పోవాలన్నా నిప్పును సమీపించడం మోస్తరుగా ఉండేది. ఆయన కళ్ళుగుడ్డిచేసేవెలుతురల్లే ఉండేవాడు. ఆవిడ కళ్ళుగుడ్డిచేసేచీకటల్లే ఉండేది. రెండూ ఒకటే అయినప్పుడు శ్రమపడి వెలుతురును సమీపించటం ఎందుకు; చక్కగా చీకట్లో నిద్రపోక! చీకటిచెయ్యలేని ఉపకారాలు వెలుతురు చెయ్యగలదని నాకు చెప్పినవారు లేరు.

నేను అయిదేళ్ళవాణ్ణయినప్పుడుకూడా మా అమ్మ నన్ను ఒళ్ళో కూర్చోపెట్టుకుని, తలనిమిరి, మొహం వాసనచూసేది. మా నాన్న నన్ను పెద్దవాణ్ణిచూసినట్టు చూసేవాడు. "నీపెంపకం మాబాగావుంది! వాడు ప్రతిదానికీ తెలీనట్టు నటిస్తాడు! వాణ్ణి ఎందుకంతఅజ్ఞానంలోపెంచుతున్నావు?" అని ఆయన అప్పుడప్పుడూ మా అమ్మను గదమాయించేవాడు. "పసివెధవ వాడికప్పుడే ఏంతెలుస్తుందండీ! మీరెప్పుడూ ఇంతేను!" అనేది మా అమ్మ. అప్పుడు వాళ్ళిద్దరికీ వాదన!—అయిదేళ్ళ పిల్లవాడికి ఎంతతెలుసుకునేటందుకు అవకాశం ఉందని! మా నాన్న చెప్పిందేనిజం. ఓంప్రథమంనించే మన ఆడవాళ్ళు పిల్లలతో తొక్కుమాటలు—"ఓంతేఅమ్మా?"—మొదలైనవి మాట్లాడకుండా ఉంటే అయిదేళ్ళ కుర్రవాడికి ఇంట్లో ఎట్లాప్రవర్తించవలిసిందీ చక్కగా తెలీటానికి, తలిదండ్రులకు ఆటంకంలేకుండా తనకు కావలసిన పనులు తనుచేసుకునేనేర్పు కలగటానికీ అవకాశంఉంది. ఒకరిదాకా ఎందుకు? పదేళ్ళు వచ్చిన తరవాతకూడా నా అంతట నేను నీళ్ళుతోడిపోసుకుని నా అన్నంనేను కలుపుకునీ ఎరగను. "నాకు పెనసలు కావాలి. ఎట్లా నాన్నా?" అనేరకం కుర్రవాణ్ణి చూస్తే మానాన్నకు అసహ్యం. కారణంచెప్పకుండా—ఆమాటకొస్తే చెప్పిఅయినా—డబ్బులడిగే పిల్లవాడు దుర్మార్గుడని, డబ్బులు పెద్దవాళ్ళు తాకవలసిందే కాని పిల్లలు తాకరాదని మా అమ్మ అభిప్రాయం. మానాన్న ఇష్టప్రకారం ప్రవర్తించటంలో కొంతబాధ్యత నాపైన ఎప్పుడూ ఉండేది. అది నాకిష్టంలేదు.

ఈసందర్భంలోనే మా అమ్మకూ నాన్నకూ ఇంకో అభిప్రాయభేదం ఉండేది. నాప్రవర్తనలో నాకు కొంతస్వేచ్ఛ ఇవ్వమనీ, పిల్లవాడివిషయం పరిపూర్ణమైన జాగ్రత్త ఉంచటం తల్లిదండ్రులకూ అసంభవమనీ అనేవాడు. మాఅమ్మకిది అఘాయిత్యంగా కనపడేది. "వాడు నిప్పులోపడి కాలిపోతున్నా చూస్తూ ఊరుకుంటారండీ మీరు!" అని కోప్పడేది ఆవిడ.

"వాడిజాగర్త వాణ్ణి తీసుకోనివ్వటం చాలా మంచిది. అవిటిశరీరంకన్న అవిటిమనస్సు దుర్భరమైనది!" అనేవాడు మానాన్న. వాదనలో ఈవిధంగా అతిగా వెళ్ళటం ఆయనకు అలవాటు. నాఉద్దేశం పిల్లవాడికి అవుడులేని శరీరం మనస్సుకూడా ఏర్పాటు చెయ్యవచ్చునని—వెయ్యికళ్ళతో పిల్లవాణ్ణి కాపాడే నవసరం లేకుండానే...

వెయ్యికళ్ళతో కనిపెట్టి మా అమ్మ నాకు చేసిన ఉపకారంమాత్రం ఏముంది?...

పెట్టుపోతల్లో మాఅమ్మకంటిది లేదని ప్రతీతి! ప్రతిపూటా సాక్షిష్టమైన ఆధరువు—సామాన్యంగా కందిపచ్చడి—చేసి ఎక్కువ ఎక్కువగా పెట్టేది. ఒకచెంప నేను తినలేక గుడ్లు వెళ్ళుకొచ్చి కొట్టకుంటే "పిచ్చిసన్యాసి! నీ ఆకలి నీకేతెలీదేం? చిన్నగొట్టం పోస్తే అన్నమంతా అట్లాగే ఉండేను!...కడుపు నిండా తినకపోతే ఏమవుతుందో తెలుసా? నిద్రపోతున్నప్పుడు జీవుడు వెళ్ళి పొయిమీదపెట్టబోతున్న శూద్రవాళ్ళ అన్నంకుండలో ప్రవేశిస్తాడు. వాళ్ళు కుండ పొయ్యిమీదపెట్టి మూతపెడతారు!" అనేది. ఈమహానరకం తప్పేటందుకు మానాన్నముద్దా, మా అమ్మముద్దా మొదలైనవన్నీ బలవంతాన దిగమింగేవాణ్ణి...నాకు వాగాని కోసారిచచ్చేటంత జబ్బు రావటం రొండులంఖణాలు చెయ్యటం జరుగుతూండేది—వేంకటేశ్వరస్వామికీ, పోలేరమ్మకు, సుబ్బారాయుడికీ, ఇంకెవరెవరికో ముడుపులతోసహా.

తతిమ్మా విషయాల్లో నాప్రాణానికావిడ ఇనపెట్టల్లే ప్రవర్తించేది. నేను బావిదగ్గిరికిపోయి బావిలో మొహంపెట్టి బోయమని అరవటానికి వీల్లేదు, రైల్లో పోతున్నప్పుడు కిటికీలోనించి బయటికివంగి రైలుపొగ వాసన చూడటానికి వీల్లేదు, రైలుస్టేషనుకు పోయి గుడ్సుబండి పెట్టెలు లెక్కపెట్టి స్టేషనులో గాసులైటు వెలిగించటం చూసి చీకటిపడ్డతరవాత ఇంటికి రావటానికి వీల్లేదు. నన్ను మాఅమ్మ ఈవిధంగా సంరక్షించినప్పుడల్లా మానాన్న "నీబాగ రక్షిసుకోటంకాదు కాని వాణ్ణి అనాధను చేస్తున్నావు. వెన్నెల్లోకూడా బయటికిపోవటానికి భయంవాడికి!" అనేవాడు. మా అమ్మమండిపడి మనిద్దరంబతికిఉంటే వాడెందుకు అనాథఅవుతాడు?" అన్న దొకసారి. "దిక్కులేనివాడు అనాథకాడు. దిక్కులేకుండా జరగనివాడు నిజమైన అనాథ!" అన్నాడాయన. ఆమాట ఆవిడకు అర్థంకాలేదు...ఎక్కువ తెలివిగలదికాదు పాపం ఆవిడ.

పెట్టనికోట! వాడు మంచానపడగానే ఏసుబ్బారాయుడో—"

"అవునులెండి! వాడు చావుబతుకులమీద ఉన్నామీకు కనికరం ఉండదు!"

దానిమీదట మానాన్న ఎగతాళిగా "అహా! ఏం మాతృప్రేమ? అజీర్ణంతో వాడు మంచానపడగానే వాణ్ణప్పుడే టపాకడుతుంది!" అంటాడు...

ఈసందర్భంలో పిల్లలచావులనుగురించి ఒక ముక్క రాస్తాను. మనం సామాన్యంగా పిల్లలపోషణ విషయంలో బయటపెట్టుకునే అజ్ఞానంచూస్తే రొండుమూడు సంవత్సరాలవయసులోపల ప్రతి పిల్లా, పిల్లవాడు ఏక్షణం పడితే ఆక్షణం చావటానికవకాశంఉంది. శిశుమరణం సంభవించినప్పుడల్లా తల్లి "అప్పుడేపోతావనుకోలేదో!" అని ఏడుస్తుంటే నవ్వాలో విచారించాలో తెలీకుండా ఉంది. ఆవిధంగానే ప్రతివాళ్ళూ తమ ఆప్తవర్గంలో ఎవరోఒకరు ఏరోజునైనా చచ్చిపోవటానికి సిద్ధంగాఉండకపోవటంయొక్క ఫలితం మహాఘోరంగా అనుభవిస్తారు. ఎప్పటికప్పుడు స్మశానవైరాగ్యం తెచ్చుకోవటమేకాని చావుయొక్క అవశ్యకత ఎవరూ గ్రహించినట్టు కనపడదు. అందరికీ వచ్చే చావు చెడ్డదెట్లాఅవుతుందని ప్రశ్నించినవారు కనపడరు. చచ్చినవాళ్ళు తిరిగి పుట్టటం ఉన్నదని నిరూపించటానికెక్కడ చోటులేదు. ఉన్నదని భావించుకుంటే ఎక్కువమంది హిందూసోదరులు తప్పుపట్టరు కనక అట్లాగే భావించుకుని ఒకమాట మనవిచేస్తాను. కిందటి జన్మనుగురించి ఎందుకు జ్ఞాపకంఉండదని ప్రశ్నవచ్చినప్పుడు ఒకరు—వివేకానందస్వామో, రామకృష్ణపరమహంసో జ్ఞాపకంలేదు—కిందటిజన్మ అనేకసంవత్సరాలకిందటిది, ఈజన్మలోవిషయాలే మనం మరిచిపోతున్నప్పుడు అంతకాలంకిందటి విజ్ఞాపకం ఉండటం కష్టం. అయినా కావాలని ప్రయత్నంచేస్తే జ్ఞాపకం వస్తవి. నాకుజరిగిన జన్మలు జ్ఞాపకంఉన్నవని సెలవిచ్చారు. అది కావచ్చును, కాకపోవచ్చును. కాని [illegible]

ఎక్కువభేదం ఉండదు. జీవితం ప్రయాణమేనని ఒప్పుకుంటాను. కాని "తామరాకుమీద నీటిబొట్టులాగ ఉండు! ఈ భార్యఎవరు? ఈకొడుకెవరు? నువ్వుచేరవలసినచోటే దేనని ఎక్కడపడితే అక్కడ ఆగకు. గమ్యస్థానం మనస్సులో ఉంచుకో!" అని చెప్పగానే సామాన్య మానవుడు అర్థంచేసుకోలేడు. అసలా వేదాంతంలోనే పొరపాటున్నది. భార్యాపుత్రులు ఎవరూ కాకపోలేదు! తోడుప్రయాణీకులు. వీళ్ళు మనతో రాలేరని అధైర్యంతో స్తే తప్ప వాళ్ళను విడనాడుకోనక్కరలేదు. నీదారిన నువ్వు నడు. అటుఇటు చూడకంటే పోతున్న దారి సరిఅయినదేనా అని చూడవలసివస్తుంది. మన వేదాంతంలో వచ్చినచిక్కేమిటంటే అది ఎవరికోసం ఉద్దేశింపబడ్డదో వాళ్ళకు అర్థంకాదు. మనిషి కొంతకాలం బతికినతరవాత ప్రయాణానికి అర్హుడుకాకుండా పోతాడు. అప్పుడు చావు వరమల్లే వస్తుంది. అందుకని ఆచావు ప్రతిరెండు సంవత్సరాల కొకసారి వచ్చినా ప్రయాణంలో అడుగడుక్కూ కూర్చున్నట్టుటుంది. మనకు డాక్టర్లంతా శోధనచేసి కనిపెట్టవలిసిందేమిటంటే ఒక్కశరీరంతో కూర్చోకుండా ఎంతకాలం ప్రయాణంచెయ్యగలం అనేది బెర్నార్డ్ షా మూడువందలఏళ్ళు కావాలన్నాడు. మంచిది. నేనుకూడా ఒప్పుకున్నాను! చిన్నటిబాధలు ఇవాళ జ్ఞాపకంరాకుండా ఏదైనా ఏర్పాటుంటే ప్రతినిద్రానంతరం మనంకొత్త మనుష్యులం అవుతామన్నాడు వెల్స్. ఏగవర్నమెంటులోనన్నా ఏరోజు సమస్యలు—ఇవి సామాన్యంగా శరీరసంబంధమైనవిగా ఉంటున్నై—ఆరోజే తీరిపొయ్యే ఏర్పాటు జరిగితే ప్రతినిద్రా ఒక చావు కింద ఉపయోగించుకుని—ఆనిద్రే బాల్యంలేని పునర్జన్మ ఇచ్చే చావవుతుంది—ఒక వెయ్యిజన్మలో సాధించగలవృద్ధి ఒక్కజన్మలో సాధించి ధన్యులం కావటాని కవకాశంఉంది. అందరూ ఆలోచించండి!...

అసలువిషయం...మా అమ్మపెంపకంలో నాకు నచ్చినదేమిటంటే—బాధ్యతతో సెయ్యటం, నిజాన్ని కప్పిపుచ్చటం, ఎదురుగా కనపడుతున్నది లేదనుకోటం, అబద్ధంలేక అసత్యం నాగరికతకు ఆధారమనుకోటం, నాలో నాకు నమ్మకంలేకపోవటం, నాఅంత ఛండాలుడు లేడు నాకన్న నాస్నేహితులంతా మంచివాళ్ళనుకోటం, నాకుచెయ్యాలనిఉండేపనులే ఎవడైనా చేస్తే వాణ్ణి ఏవగింపుతో చూడటం, నిజం నాకు బాధ కలిగించటంవల్ల నిజంమాట్లాడేవాళ్ళు పాషాణహృదయులనుకోటం మొదలయినవి.

నాకు మొదటినుంచి ఆడపిల్లలతో ఆడుకోటంఇష్టం మగపిల్లలతో తిరగటంకంటె. మా నాన్న ఇటువంటి విషయాల్లో పాతఫక్కీగానే ఉండేవాడు. "అవెధవెందుకు ఎప్పుడూ ఆడపిల్లలతో పడివుంటాడు! ఆడకుంక కావటానికా? సభాపిరికితనం, సిగ్గూ, మెతకతనం, తనలో విశేషం బయటపెట్టుకోలేకపోవటం మొదలయిన గుణాలన్నీ రావటానికా?" అనేవాడాయన. చిన్నతనంనించి ఆడపిల్లలనూ మగపిల్లలనూ వేరువేరు గదుల్లో ఖైదుచెయ్యటంవల్ల కలిగేనష్టాలు నాకు స్పష్టంగా తెలుసును. కాని ఆయన అన్నదానిలో నిజం లేకపోలేదు!

తరవాత నాచదువుసమస్య వచ్చింది. మా నాన్న వాడన నేర్చుకోవలిసిందేకాని నేర్పటమంటూ లేదని. మాఅమ్మ నేర్పందీ ఎట్లావస్తుందనీ! భార్యాభర్తలలోనే ఒకరిభాష ఒకరిదికాదు. మాఅమ్మే గెలిచింది. నన్ను చదవేశారు వీధిబళ్ళో. మా నాన్న చెప్పినప్రకారం ఒకనెలా, రెండునెలలో రావలసినవిద్య వీధిబళ్ళో రెండుసంవత్సరాలు గడిపినతరవాత వచ్చింది. తరవాత నన్ను స్కూల్లో చేర్చారు.

అప్పుడుకూడా మా నాన్న చెప్పనేచెప్పాడు ఈ చదువు ఎందుకూకొరగాదని. మాఅమ్మ "చదువుకోకుండా వాడు భటాచోర్లే తిరగాలనా మీకోరిక?" అన్నది. "ఈచదువేమిటి? నేను చెప్పినట్టు చెయ్యనీ వాడు ఉద్యోగంకోసరం దేబిరించకుండా నెలకు రెండువందలరూపాయలు సంపాదించే ఏర్పాటుచేస్తాను." అన్నాడు మా నాన్న. "అబ్బో! అంత్తాక ఎందుకులెండి! అయినా మీరేంచెబుతారు వాడికి?" అన్నది మాఅమ్మ. "ఏంచెబుతానా? వ్రడంగం నేర్పుతాను. సంగీతం నేర్పుతాను. నాటకంలో వేషాలువేయిస్తాను రోజూ సది

రూపాయలు సంపాదిస్తాడు." (ఈరోజుల్లో ఇంకా ఎక్కువసంపాదించవచ్చును.) ఇంకోసంవత్సరంలో వాడిచేత నెలకు పదిరూపాయల ఉద్యోగం చేయిస్తాను! నీకేవిషయాలేం తెలుసును?" అన్నాడు మానాన్న. ఆవిడ ఎగతాళిగానవ్వి "తెలుస్తూనేఉంది లెండి! నాటకాలూ, వేషాలూ, తాగుడూ,, ముండలూ!" అంది. మానాన్న పరధ్యానంగా మీసాలు సవరించుకుంటూ, "నేను రెండుసంవత్సరాలపాటు వేషాలువేశాను!" అన్నాడు.

మళ్ళీ మా అమ్మే గెలిచింది. నేను స్కూల్లో ప్రవేశించినప్పటినించీ లోకం మారటం మొదలు పెట్టింది. నేను ఇంగ్లీషు ప్రారంభంచేసిన క్షణంనించీ మాఅమ్మకు అర్థంకాకుండాపోవటం మొదలుపెట్టాను. నాకు కొత్త గురువులు, కొత్త ఆదర్శాలు, కొత్తసంఘం, కొత్త సంపర్కాలూ, క్రమంగా నా చుట్టూ చేరిన ఈ కొత్త సంఘంలో అతికిపోవటానికి నావ్యక్తిత్వం పోగొట్టుకోవలిసివచ్చింది. మా అమ్మ చెప్పిన మాట వినటంలోనూ ఈ కొత్తసంఘం బయటికి అనకుండానే శాసించేశాసనాలకు లోబడటానికి చాలాభేదంఉంది. క్రాపింగుపెట్టుకోటం, చలవబట్టలు ధరించడం, నలుగురితో నాటకాలకూ సినిమాలకూ, హోటళ్ళకూ, సిగరెట్లుకూ డబ్బులు జేబులో ఉండటం మొదలయిన అలవాట్లయినై. అదితప్పుకాదని నాకుతెలుసును. మా అమ్మకేమర్థమవుతుంది? నేనిప్పుడావిడ శిక్షణలోలేనని ఆవిడ ఎందుకు గ్రహించదు? నే నింకా ఆవిడ అనుశాజ్ఞల్లో ఉన్నట్టు ఎందుకు నటించటం? ఆవిడకు నాకొత్తస్వరూపంఅర్థంకావటానికి ఇంటిదగ్గిర లేనివ్యక్తిత్వం తెచ్చిపెట్టుకున్నాను. ప్రతిరోజూ నామనస్సు, జ్ఞానం వృద్ధవుతున్నకనే అహంకారం ఎక్కువకావటం మొదలుపెట్టింది. క్రమంగా పాశ్చాత్యమర్యాదలు నేర్చుకున్నాను...

నేను బి. ఏ. పరీక్షకు పోబోతుండగా మానాన్న పోయినాడు'...నరకంలో నిద్రపోయి స్వర్గాన్నిగురించి కలలుకంటూ మేలుకుని నిజమైన పరిస్థితులు కనుక్కున్నట్టయింది నాసంగతి!...

నాచదువు, నా టీపార్టీలు, నా గర్వం నాకిప్పుడేమి సహాయం చేస్తై? నా మనసు తాగి తందనాలాడుతుంటే వికసిస్తున్నదనుకున్నాను. (శరీరసంబంధమైన నిషానుగురించి ఉపన్యాసాలింతమంది ఇస్తున్నారు! మానసికమైన నిషానుగురించి ఎవరూ ఎందుకు మాట్లాడరు? ఇటువంటినిషా ఒక్క ఇంగ్లీషు చదువులోనే ఉన్నదని పొరపాటుపడే వాళ్ళను కాళిదాసుచదవటంవల్ల, మను

## భ్రమర!

నీవసంతముతోడ నీ యౌవనముపోయె
మోడుప్రమాలదివాంధములువసించెడునిచట
ఈముండ్లపొదరింట నీప్రేతభూమిలో
ఏలద్రిమ్మరెదోయి హృదయవేదనతో
లేదు నీవిరికన్నె లేదోయి భ్రమర!

నీ విరూపమ్ము సంధ్యావినిర్మలమైన
శ్యామలాబ్దమ్ముగా సరిపోల్చుకొనుచుండు
ఆనందములదీవి యనిపొంగిపోయెడు
ఆయుషాంగావలోకాంతరోచిస్సులు
ప్రళయగర్భమ్ములోపల లీనమైపోయె
లేదు నీవిరికన్నె లేదోయి ఇచట.

మధురాతిమధురమై మలసిపోయిననాడె
నీ గీతికాధ్వనుల్ నిండించుకొనియె
అవ్యక్తమై శాశ్వతాతి ఘోరమైన
ప్రేమలోకచ్యుత వికృతరోదనములు;
ఏలద్రిమ్మరెదోయి, ఈప్రభాతమున
లేదు నీవిరికన్నె లేదోయి ఇచట.

—ఊటుకూరు సత్యనారాయణరావు.

చరిత్రా వసుచరిత్రా చదవటంవల్లా ఏమైనా మనోవికాసం కలుగుతుందా అని అడుగుతాను. రాతల్లో ఇప్పటివాళ్ళు ఇంగ్లీషుసాంప్రదాయం చూపిస్తున్నారని మొత్తుకునే వాళ్ళలో ఒక్కడు మనస్సుకు ఉపకారంచేసే వాక్యం ఒక్కటిరాయలేరు. కనక అటువంటి అసందర్భపుమాటలతో తెలివి తక్కువతనం వెళ్ళబెట్టుకోక ప్రతిఅంధుడిమీదా విధిగా ఇంగ్లీషు నేర్చుకుని కనీసం హెచ్. జి. వెల్స్‌రాసిన నవలలైనా చదివి ఇరుకుసందల్లో ఉన్నమనస్సును విశాలపరచుకోమని సలహా ఇస్తాను. పొట్టలో చుక్కభావత్తులూ, అరసున్నాలూ, బండిరాలూ సరిగారాస్తే చదివేటట్టూ లేక పోతే వాళ్ళను వెక్కిరిస్తూ సశేషవ్యాసాలు రాసేటట్టూ!)

మొత్తానికి స్కూల్లో చెప్పిన చదువంతా దొంగ చదువు. ఇంగ్లీషుభాషను తెలిసిందేకాని దాన్ని జరపటానికి కావలిసినడబ్బు ఎక్కణ్ణించివస్తుంది. స్కూల్లో దారిద్ర్యాన్ని శ్లాఘిస్తూచెప్పారు. నాదారిద్ర్యాన్నిశ్లాఘించేదెవరు? మానాన్న బతికి ఉండగాఅన్న ఒకమాట జ్ఞాపకం వచ్చింది....

ఒకసారి నేనాయన్ను ఏ నాటకానికో డబ్బడిగాను. ఆయనఇస్తూ "ఈనెల నీకింద పదిహేనురూపాయలు ఖర్చయింది. తెలుసునా?" అన్నాడు. మాఅమ్మ వెంటనే "అయ్యో! అదేమిటండీ! అట్లా అంటారు!" అన్నది. ఆయన శాంతంగా ఆవిడ వైపుతిరిగి "తప్పు లేదు. వాడీడబ్బు చెట్లనించి రావటంలేదని తెలుసుకోవటం మంచిదికాదా?" అన్నాడు...

ఆయనే నా తండ్రికాకుండా తల్లయిఉంటే! బిడ్డలను గురించిన ఎన్నిపుస్తకాలు అటువంటి తల్లితో సమానం!...

అది చదవటం పూర్తిచేసి చాలాసేపు ఆలోచిస్తూ కూర్చున్నాను. తరవాత వాడితో "ఒరే. సూరీ! నువ్విందాకన్న పిల్లల పెంపకంమీద వ్యాసం రాయరాదా?" అన్నాను.

"నేను చూస్తున్నాను! ఏదైనా నానోటినించి వచ్చినా నేను రాస్తే చదివినా నీలో ఒక విధమైన అసంతృప్తి కనబడుతుం దెందువల్ల?"

నేను చెప్పలేనన్నాను. వాడన్న మాట నిజమే. నా డొంకవిషయాన్ని గురించి గంటసేపు మాట్లాడినా దానిచుట్టూ తిరుగుతాడుతప్ప దాన్ని తాకడు.

సూరితల ఊపి, "బహుశా నువ్వొక పొరపాటు చేస్తున్నావు' ఆవునుగురించి నేను మాట్లాడటం మొదలుపెడితే దానికి రెండుచెవులు, కళ్ళూ, కొమ్ములు మొదలయినవి ఉంటవని ఇన్ఫర్మేషన్ ఇస్తానని నీ అభిప్రాయం? అవునా?" అన్నాడు.

"అదుగో! అదీ! ఆపనిచెయ్యవు!"

"ఆపనిచేస్తే నీకేం ఉపకారం? ఒక సబ్జక్టును గురించి నువ్వేవిధంగా ఆలోచించాలో చెబుతాను. ఆ ఆలోచనకూడా నన్నేచెయ్యమంటే ఇక నువ్వు చేసేదేమిటి? నేను శిశుపోషణమీద పుస్తకంరాస్తే భేష్ బాగా రాశాడంటారు. ఒక్కరు చదవరు. పిల్లలు ఎప్పటి మోస్తరుగానే పోషింపబడుతూ ఉంటారు. పుస్తకాలుకాదు ఒకతల్లి అవసరం. ప్రతిఆడదాన్ని అద్భుతమైన తల్లిని చెయ్యాలి!"

"సరే! నీ ఒకతల్లి అట్లా ఉండనీ కాని, ఈవ్యాసం ఏంచెయ్య దలుచుకున్నావు?"

"ఎందుకు?"

"నాకియ్యి! పత్రికలకు పంపిస్తాను," అన్నాను.

సూరి నాచేతులో కాగితాలు లాక్కుని "అంటికన్న తగలబెట్టటానికి ఒప్పుకుంటాను!" అన్నాడు.

వాడు చూడకుండా నేను నాలిక కొరుక్కున్నాను. వాడి కింకా తెలీదు!—ఇంకా వారంరోజులు కూడా కాలేదు, నే నీమధ్య ఒక మాసపత్రికలో చక్కని వ్యాసంపడితే చదివి వినిపించాలని ప్రయత్నం చెయ్యటం, నేను "తెనుగన్నలారా...నడుములు కట్టుకొనుడు!" అని భావయుక్తంగా చదవగానే సూరి "షటప్, యూ ఇడియట్!" అంటూ కళ్ళు పెద్దవి చేసి నామీద లేవటం! సూరినిగురించి ఈవిధంగా రాస్తున్నందుకు వాడెప్పుడో నాపని పట్టిస్తాడు!

—కొడవటిగంటి కుటుంబరావు.